అగ్రనేత
తెలుగు దిన పత్రిక
TELTEL/2015/66279
రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :145 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 12-08-2025 | పేజీలు:4 వెల: 2.00

## మంత్రి కొండా సురేఖ ఇంటిముందు కార్యకర్తల నిరసన.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక!

హనుమకొండ : హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటి ముందు సీఐటీయూ కార్యకర్తలు నిరసన చేపట్టారు.మధ్యాహ్న భోజన పథకం అక్షయపాత్రకి ఇవ్వొద్దంటూ మంత్రి ఇంటి ముందు సీఐటీయూ కార్యకర్తలు నిరసనకు దిగారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు కేటాయించే ప్రతిపాదనలను విరమించుకోవాలంటూ నినాదాలు చేశారు. మధ్యాహ్న భోజన పథకంపై ఆధారపడి జీవన సాగిస్తున్న వారికి నష్టం చేసే తీరును విరమించుకోకపోతే.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ కార్యకర్తలు హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.అక్షయపాత్ర ఫౌండేషన్ అనేది భారతదేశంలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసే ఒక స్వచ్ఛంద సంస్థ. ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పోషకాహారం అందిస్తుంది. అక్షయపాత్ర 2000 సంవత్సరంలో బెంగళూరులో ఐదు పాఠశాలల్లో 1,500 మంది పిల్లలతో ప్రారంభమైంది. ప్రస్తుతం దాదాపు 17 వేల పాఠశాలల్లో 2 మిలియన్లకు పైగా పిల్లలకు భోజనం అందిస్తుంది.

# దరఖాస్తులు తప్పితే దమ్మిడీ ఇచ్చింది లేదు..



హైదరాబాద్, 'రైతు బీమా' పథకం పునరుద్ధరణకు గడువు దగ్గరపడింది. 2024-25 బీమా గడువు ఆగష్టు 13తో ముగుస్తుండగా..2025-26కి ప్రీమియం చెల్లిస్తే ఈ నెల 14 నుంచి కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. రైతు బీమా పథకంలో చేరే రైతులు స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంది. రైతులు తమతో పాటు నామినీకి చెందిన ఆధార్ కార్డు, పట్టా పుస్తకం దరఖాస్తుకు జతచేసి స్వయంగా వ్యవసాయశాఖ అధికారులకు ఇవ్వాలి. అర్జీలకు మరో మూడు రోజులే గడువు ఉండడంతో.. రైతులు తమ పనులు మానుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వంపై కౌంటర్ వేశారు. కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుందని, ఒక్క పథకమూ అమలు కావడం లేదన్నారు. 'తిక్కలోడు తిరనాళ్లకు పోతే ఎక్కా, దిగా సరిపోయిందని.. అసమర్ధ, అవివేక కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుంది తప్ప ఒక్క పథకమూ నిర్దిష్టంగా అమలు కావడం లేదు. భూమిని నమ్ముకున్న రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షలు ఆ కుటుంబానికి అందించే రైతుబీమా పథకం 2018 నుండి కేసీఆర్ గారి ప్రభుత్వం అమలుచేస్తూ వస్తున్నది. పథకం ప్రారంభించినప్పటి నుండి 2023 డిసెంబర్ వరకు 1,11,320 రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.5,566 కోట్ల పరిహారం అందించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబీమా ప్రీమియం చెల్లించకుండా జాప్యం చేయడం మూలంగా వేలాది మంది రైతు కుటుంబాలు బీమా సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు 14తో రైతుబీమా ప్రీమియం గడువు ముగుస్తుంది. దీంతో ప్రభుత్వం ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయడం ఆనవాయితీ. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గడువు దగ్గరకు వచ్చిన తర్వాత రైతుబీమా కోసం రైతు స్వయంగా స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రం అందజేయాలని, తనతో పాటు నామినీ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు అందజేయాలని నిబంధన పెట్టారు' అని కేటీఆర్ మండిపడ్డారు.'రైతుబీమా రెన్యువల్‌కు కేవలం మూడు రోజుల గడువు మాత్రమే ఉన్నది. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా నడుస్తున్నాయి. ఎరువులు దొరక్క రైతులు చెప్పులు, బుక్కులు లైన్లో పెట్టి పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటి కీలక సమయంలో రైతుబీమాకు తిరిగి స్వయంగా రైతులు దరఖాస్తు చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం మూర?త్వం. గతంలో చేసినట్లే రైతుబీమా రెన్యువల్ చేయాలి. దరఖాస్తు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నది. కాంగ్రెస్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ప్రతిపక్షాలు, ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు.. ఎవరి మీద విసురుతారో తెలియని పరిస్థితి నెలకొంది. దండగమారి కాంగ్రెస్ పాలనలో దరఖాస్తులు తప్పితే సామాన్యులకు ఈ సర్కారు దమ్మిడీ విదిల్చింది లేదు. బోగస్ మాటలు, బ్రోకర్ వేషాలు తప్ప 20 నెలల కాంగ్రెస్ పాలనలో సామాన్యులకు, తెలంగాణకు ఒరిగిందేమీ లేదు. జాగో తెలంగాణ జాగో' అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదు.. సమాజానికి అందించే బాధ్యత!

హైదరాబాద్,ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదని, సమాజానికి అందించే ఓ బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మానవ వనరులు అత్యంత బలమైన పెట్టుబడి అని, మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు.గతేడాది అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారని, 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలన్నారు. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.'మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకు ఎంతో కొంత సాయం అందించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం. మొత్తం సాయం కాకపోయినా.. కొంత మీకు అండగా ఉండాలని అభయ హస్తం ఇస్తున్నాం. మెయిన్స్‌కు వెళ్తున్న వారికి లక్ష సాయం చేస్తున్నాం, కొంత కోచింగ్‌కి ఉపయోగ పడుతుందని ప్రభుత్వ ఆలోచన. లాస్ట్ ఇయర్ అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారు. 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలి. సివిల్ సర్వెంట్‌ల సమావేశాల్లో కొందరు ఐఏఎస్‌లను రోల్ మోడల్‌గా చెప్తారు. మాధవరావు, ఎస్ఆర్ శంకరన్ లాంటి వాళ్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాం. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుంది. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదు.. సమాజానికి అందించే



బాధ్యత. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సక్సెస్ అవుతాయి. మాకు ఎంత చేయాలి అని ఉన్నా.. ఐఏఎస్‌లలో నిబద్ధత లేకుంటే లక్ష్యం చేరుకోలేం. శంకరన్ లాంటి వాళ్లు సంక్షేమ శాఖల్లో పని చేశారు. మిషన్ లాగ పని చేస్తే.. ప్రజలు కూడా మిషన్ లాగే మర్చిపోతారు. సవాళ్లను అధిగమించి లక్ష్యం సాధించండి' అని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు.'స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి.. ఇవాళ సివిల్స్‌కి వెళ్లే వారి వరకు అందరికీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నాం. 55 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణ కి ఇప్పటికే టెండర్లు పిలిచాము. రైతు కొడుకు రైతే అవుతున్నాడు. మేము ఐదేళ్లు.. పదేళ్లు పదవుల్లో ఉంటాం. సివిల్స్ సాధించి మీరు ప్రజల సేవలో ఉండండి. కాన్ఫిడెన్స్‌తో సివిల్స్ ప్రిపేర్ అవ్వాలి. డిల్లీలో నా క్వార్టర్స్‌ను చదువుకునే వారికే ఇచ్చా. నా క్వార్టర్స్‌లో ఉండి చదువుకున్న ఇద్దరు ఇప్పుడు నా జిల్లాలోనే సర్వీసులో ఉన్నారు' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

# శశిథరూర్ యూటర్న్..ఇండియా కూటమి ర్యాలీలో ప్రత్యక్షం

న్యూఢిల్లీ,ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సోమవారం ఢిల్లీలో ఇండియా కూటమి భారీ ర్యాలీ చేపట్టింది. పార్లమెంట్ భవన్ నుంచి ఈసీ ఆఫీస్‌కు మార్చ్ చేపట్టింది. విపక్ష ఎంపీలంతా ర్యాలీలో పాల్గొన్నారు.కేంద్రానికి, ఈసీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. వ్యతిరేక నినాదాలు చేశారు. అయితే అనుమతి లేదంటూ బారికేడ్ల దగ్గర పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో ఎంపీలు వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంతలో మహిళా ఎంపీలు, అఖిలేష్ యాదవ్ బారికేడ్లు దూకే ప్రయత్నం చేశారు.ఇదిలా ఉంటే ఆశ్చర్యంలో కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టుగా ఉండే శశిథరూర్ అనూహ్యంగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈసీ ఆఫీస్‌కు చేపట్టిన మార్చ్‌లో శశిథరూర్ కూడా ప్రత్యక్షమయ్యారు.చాలా కాలంగా శశిథరూర్ బీజేపీతో కలిసి తిరుగుతున్నారు. ఇటీవల కేంద్ర తరపున దౌత్య బృందానికి నాయకత్వం వహించారు. ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సిందూర్ గురించి తెలియజేశారు. అంతేకాకుండా నిత్యం బీజేపీ నేతలతోనే చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతుంటారు. ఇక సొంత పార్టీపైనే విమర్శలు గుప్పిస్తుంటారు. అలాంటిది సోమవారం ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీలో పాల్గొని ఆశ్చర్యపరిచారు. త్వరలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సంఘం రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) సర్వే చేపట్టింది. ఇందులో భాగంగా 65



లక్షల ఓట్లను తొలగించింది. దీంతో విపక్షాలు ధ్వజమెత్తాయి. అధికార పార్టీకి మద్దతుగా ఎన్నికల సంఘం ఓట్లు తొలగించిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండిస్తోంది. తనిఖీలు చేశాకే ఓట్లు తొలగించినట్లు చెప్పింది. ఇక ఇటీవల గత లోక్‌సభ ఎన్నికల్లో మోసం జరిగిందంటూ కర్ణాటకలో జరిగిన ఘటనను రాహుల్ గాంధీ ఎత్తిచూపారు. అయితే దీనిపై రాహుల్ గాంధీకి నోటీసు జారీ చేసింది. అయితే తాము అడిగిన సమాచారం ఇవ్వాలంటూ తాజాగా ఈసీ ఆఫీస్‌కు మార్చ్ చేపట్టారు.

# ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్ర శిబిరాలు ధ్వంసం..




జమ్మూ కాశ్మీర్: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే నెలలో ఆపరేషన్ సిందూర్ ప్రారంభించింది ఇండియన్ ఆర్మీ.. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం చేసింది..భారత్ దెబ్బకు బెంబేలెత్తిన పాకిస్తాన్ కాళ్ల బేరానికి రాకతప్పలేదు. మరోవైపు, భారతే యుద్ధం వద్దని దిగువచ్చింది విజయం మనదే అంటూ.. ఆ దేశ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసింది.. అయితే, ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జరిగిన దాడికి సంబంధించిన వీడియోను భారత వైమానిక దళం (ఐఏఎఫ్) విడుదల చేసింది..ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేయబడిన 5 నిమిషాల వీడియోలో మొదట ఏప్రిల్ 22 న జరిగిన పహల్గామ్ ఉగ్రదారికి సంబంధించిన వార్తాపత్రికల క్లిప్పింగ్‌లను చూపించింది, దీనిలో 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ మరియు త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు చూపించింది. ఇక, ఆ తర్వాత " ఆపరేషన్ సిందూర్ " అనే టెక్ట్స్ తో నల్లని బ్యాక్ గ్రౌండ్ కనిపించింది.. తర్వాత "భాతర వైమానిక దళం ఖచ్చితత్వంతో, వేగంతో, సంకల్పంతో స్పందించింది" అని రాసుకచ్చింది..ఇక, ఆ తర్వాత పాకిస్తాన్ మరియు పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై భారత యుద్ధ విమానాలు జరిపిన వైమానిక దాడులను చూపించింది. "ధ్వంసం చేయబడిన" ఉగ్రవాద శిబిరాలను చూపించే క్లిప్‌లు మరియు చిత్రాలను కూడా ఇందులో పొందుపరిచింది.. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో యుద్ధ విమానాలు ఎలా పనిచేస్తున్నాయో కూడా ఈ వీడియోలో చూపించారు. 2019లో పుల్వామా దాడికి ప్రతిస్పందనగా కార్గిల్ యుద్ధం మరియు భారతదేశం జరిపిన దాడులను కూడా ఇందులో ప్రస్తావించారు. ఆకాశం చీకటిగా మారి, భూమి లేదా సముద్రంలో ప్రమాదం పొంచి ఉన్నప్పుడు, ఒక శక్తి పైకి లేస్తుంది. విశాలమైనది, నిర్భయమైనది మరియు ఖచ్చితమైనది. భారత వైమానిక దళం," అని వాయిస్ ఓవర్‌లో వివరించింది.పహల్గామ్ దాడితో సరిహద్దు లింక్‌లను కనుగొన్న తర్వాత భారత సాయుధ దళాలు మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించాయి . వారు బహుళ ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి 100 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చాయి.. ఆ తరువాత పాకిస్తాన్ భారీ క్షిపణి మరియు డ్రోన్ దాడిని ప్రారంభించింది, దానిని భారత్ విజయవంతంగా తిప్పికొట్టింది.. ప్రతీకారంగా, భారత దళాలు పాకిస్తాన్‌లోని వైమానిక స్థావరాలపై దాడి చేశాయి. దీంతో, వణికిపోయిన పాక్.. కాళ్ల బేరానికి రావడం మే 10న జరిగిన కాల్పుల విరమణతో యుద్ధం ముగిసిన విషయం విదితమే.. కాగా, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఐదు పాకిస్తాన్ యుద్ధ విమానాలను మరియు ఒక పెద్ద విమానాన్ని IAF కూల్చివేసిందని ఈ మధ్యే ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ ప్రకటించిన విషయం విదితమే..

# హైడ్రాలో మార్షల్స్ సంచలన నిర్ణయం!



హైదరాబాద్, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ (హైడ్రా)లోని మార్షల్స్ సంచలన నిర్ణయం తీసుకున్నారు.జీతాలు తగ్గించడంతో మార్షల్స్ విధులను బహిష్కరించారు. విధుల బహిష్కరణతో మాన్సూన్ ఆపరేషన్‌పై ప్రభావం పడింది. హైడ్రా కంట్రోల్ రూమ్ సేవలకు అంతరాయం కలిగింది. ట్రైనింగ్ కార్యక్రమం, ప్రజావాణి సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణకు హైడ్రా కృషి చేస్తున్న విషయం తెలిసిందే.గత నెల 23న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఫిక్స్ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈ జీవో ఆధారంగా మార్షల్స్‌కి రూ.22,500 జీతం అధికారులు ఫిక్స్ చేశారు. అంతకుముందు ఎక్కువ జీతాలు ఇస్తూ.. ఇప్పుడు తగ్గించడంతో హైడ్రా మార్షల్స్ నిరసన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు తగ్గించడంతో హైడ్రాలోని మార్షల్స్ నేడు విధులను బహిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో సేవలు బంద్ అయ్యాయి. 51 హైడ్రా భారీ వాహనాల సేవలు నిలిచిపోయాయి. హైడ్రాలో ఎమర్జెన్సీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. మాజీ సైనిక ఉద్యోగులు మార్షల్స్‌గా పనిచేస్తున్నారు.మార్షల్స్‌లో చాలా మంది మాజీ సైనికులు ఉన్నారు. వీరందరూ హైదరాబాద్ నగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను కాపాడటం, వర్షా కాలంలో వరదల సమస్యలను తగ్గించేందుకు పగలు రాత్రి అనే తేడా లేకుండా శ్రమిస్తారు. ఇటీవల వేతనాలను తగ్గించడంతో విధులను బహిష్కరించారు. దాంతో మాన్సూన్ ఆపరేషన్స్ సహా అనేక సేవలపై ప్రభావం కనిపిస్తోంది.

# బీజేపీ,బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందాలు..

కరీంనగర్ జిల్లా ఆగస్టు11, మేడిగడ్డ ప్రాజెక్ట్ లాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం లేదని క్లారిటీ ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌పై అధికారులే విచారణ చేస్తున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌తో లోపాయికారిగా ఒప్పందం చేసుకుందని విమర్శించారు.

తమ మేనిఫేస్టోలోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జ్యూడీషనల్ ఎంక్వైరీ వేస్తామని చెప్పామని.. అన్నట్లుగానే వేశామని గుర్తుచేశారు. ఇవాళ(సోమవారం) మంత్రి శ్రీధర్ బాబు కరీంనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు.రాజ్యాంగ వ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పుకొచ్చారు. జంతర్ మంతర్ వద్ద తమ నిరసన ధర్నాకు బీజేపీ ఎంపీలు ఎందుకు మద్దతు పలకలేదని ప్రశ్నించారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడితే జనం నమ్ముతారా అని నిలదీశారు. ఫోన్



ట్యాపింగ్‌పై విచారణకు ఎవరినీ పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణయిస్తారని వెల్లడించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# భారత్‌పై నోరుపారేసుకున్న పాక్ ఆర్మీ చీఫ్

ఇస్లామాబాద్:ఆపరేషన్ సిందూర్‌తో భారత్ చేత చావుదెబ్బ తిన్నప్పటికీ దాయాది పాకిస్థాన్ తీరులో ఎలాంటి మార్పు లేదు. తాజాగా పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన భారత్ పై నోరు పారేసుకున్నారు. తమది అణ్వాయుధ దేశమని, అవసరమైతే అణుయుద్ధానికి దిగుతామంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగారు. తాము నాశనమైతే.. తమతోపాటు సగం ప్రపంచాన్ని తీసుకెళ్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఫ్లోరిడాలోని టాంపాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మునీర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా సింధునది వివాదాన్ని ప్రస్తావిస్తూ.. భారత్‌పై నోరుపారేసుకున్నారు. సింధు నది భారతీయుల ఆస్తిఏమీ కాదంటూ వ్యాఖ్యానించారు.ఆ నదిపై భారత్ డ్యామ్‌లు నిర్మించే వరకు ఎదురు చూస్తామని చెప్పారు.తమ వద్ద క్షిపణులకు ఎలాంటి కొదవ లేదని, ఆ డ్యామ్‌లను పది క్షిపణులతో పేల్చేస్తామని హెచ్చరించారు. భారత్ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఏర్పడితే, తాము నాశనం అవుతూనే సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు.కాగా, అసిం మునీర్ యూఎస్ సందర్శనకు వెళ్లడం రెండు నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం.



ఈఏడాది జూన్‌లో అసిం మునీర్ అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రంప్ వైట్ హౌస్‌లో మునీర్‌కు ప్రత్యేకంగా విందు కూడా ఇచ్చారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణం లో.. వాషింగ్టన్‌తో పాకిస్థాన్ సంబంధాలు బలపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

# రేవంత్‌పై దాఖలైన అట్రాసిటీ కేసులో పిటీషనర్‌కు సుప్రీం చురకలు



హైదరాబాద్, ఆగస్టు11, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దాఖలు చేసిన పిటీషనర్ పెద్దిరాజుపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. హైకోర్టు న్యాయమూర్తి మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ బీఆర్ గవాయ్ ధర్మాసనం పిటీషనర్ పెద్దిరాజును హెచ్చరించింది.రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో కొట్టేసింది తెలంగాణ హైకోర్టు. ఆ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కి బదిలీ చేయాలని సుప్రీంలో ట్రాన్స్‌ఫర్ పిటీషన్ దాఖలు చేశారు పెద్దిరాజు. హైకోర్టు న్యాయమూర్తిపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు పిటీషనర్ పెద్ది రాజు. పిటీషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజులపై ఆగ్రహం వ్యక్తం చేసింది సుప్రీం ధర్మాసనం. హైకోర్టు న్యాయమూర్తి మౌసమి భట్టాచార్యకు వెంటనే క్షమాపణలు చెప్పాలని సీజేఐ బీఆర్ గవాయ్ ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది.

## సంపాదకీయం

మంగళవారం 12-08-2025

# గాలికొదిలేసిన గిరిజన సంక్షేమం

గిరిజనుల అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. కనీస రహదారులు, వైద్యం, విద్య, మంచినీరు వంటి సదుపాయాలు నేటికీ గిరిజన గూడాల్లో కనిపించవు. ఆపదొస్తే డోలీలో మోసుకు అవడం ఇప్పటికీ ఈచూస్తున్నాం. ఇటీవల ఓ గర్భిణిని కాన్పు కోసం డోలీలో వర్షంలో తడుచుకుంటూ మోసుకొచ్చారు. అంటే ఇంకా మనం వారి అభివృద్ధి విషయంలో వెనకబడే ఉన్నామని చెప్పాలి. ఏపిలో పవన్ కళ్యాణ్ డిప్యూటీ సిఎం అయ్యాక కొన్ని సమస్యలపై దృష్టి సారించారు. అందుకు ఆయనను అభినందించాల్సిందే. అలాగే తెలంగాణలో సీతక్క ఆదివిబిడ్డ కావడంతో వారి కష్టాలు తెలుసుకుని ముందుకు సాగుతున్నారు. తనవంతుగా వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే మిగతా రాష్ట్రాల సంగతి పక్కన పెడితే తెలుగు రాష్ట్రాల్లో వారి జీవితాల్లో ఇంకా వెలుగులు నిండలేదు. ప్రభుత్వాలు చెబుతున్నంతగా అభివృద్ధి జరగడంలేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించింది. ఏటా ఉత్సవాలు చేయడం, వారికి తాయిలాలు ప్రకటించడం తప్ప గట్టిగా చర్యలకు మాత్రం పూనుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా ఆదివాసీల పట్ల పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. నేటికీ వైద్యం అందుబాటులో లేదు. ప్రతి సంవత్సరం మలేరియా, -టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో వందలాది మంది మరణిస్తున్నారు. ఆసుపత్రులు ఎన్ని ఉన్నా సరైన మందుల, వైద్యులు, ఇతర సిబ్బంది కొరత వెంటాడుతుంది. సరైన రహదారి సౌకర్యాలు లేక నేటికీ గిరిజనులు డోలీమోతతోనే ఆసుపత్రికి చేరుతున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి వైద్యం అందక దారి మధ్యలోనే మరణిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో విద్య అందనంత దూరంలో ఉంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల్లో సీట్ల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతంత మాత్రమే సీట్లు ఉండడంతో చదువు మధ్యలోనే ఆగిపోతుంది. సంక్షేమ హాస్టళ్లల్లో సౌకర్యాలు లేమి, పౌష్టికాహారం లోపంతో పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. చదువుకున్న విద్యార్థులకు సరైన ఉపాధి లేక రోజురోజుకూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా తయారైంది. చదువుకున్న యువతీయువకులు వలసలు వెళ్తున్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద ఉన్న ప్రకృతి మధ్యలో నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు. మనదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8.6 శాతం ఆదివాసీలు ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. అక్షరాస్యతతో పోలిస్తే గిరిజన ప్రాంతంలో అక్షరాస్యత అతి తక్కువ. మహిళ అక్షరాస్యత 34.67 శాతం. గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులు రాజ్యాంగం కల్పించింది. వీరి అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు, పరిపాలన వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అమలు జరగడం లేదు. షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నాన్ షెడ్యూల్ మండలాల్లో వేలాదిమంది గిరిజనులు ఉన్నారు. వీరి గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నా గిరిజన చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. మెజార్టీ గిరిజనులు అడవిలో జీవిస్తున్నారు. విలువైన ఖనిజాలు కూడా వీరి నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్నాయి. ఇంత విలువైన సంపదను గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను బలహీనం చేసి, అటవీ భూమి, సహజ వనరులను బహుళజాతి, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. మనం ఎంతో అభివృద్ధి చెందామని భావిస్తున్న ఈ రోజుల్లో కూడా ఆదివాసీలకు కనీస సౌకర్యాలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు నోచుకోలేదు. ఆదివాసీలను భూములు నుండి దూరం చేసే కుట్రలు సాగుతున్నాయి. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70, అటవీ హక్కుల చట్టాలను ఒక్కొక్కదాన్ని నీరు గారుస్తున్నారు. అటవీ భూముల్ని సాగు చేసుకున్న వారికి అటవీహక్కుల చట్టం ప్రకారం 10 ఎకరాల వరకూ హక్కుపత్రాలు ఇవ్వాలి. కానీ గిరిజనులు సాగులో ఉన్న భూములకు నేటికీ పట్టాలు ఇవ్వడం లేదు. హక్కు పత్రాలు ఇచ్చిన అరెకరం, ఎకరం లోపునే ఎక్కువ మందికి ఇచ్చారు. అడవులను నమ్ముకుని బతుకుతున్న కోట్లాదిమంది బతుకు నాశనం చేసే నిర్ణయం కేంద్రం తీసుకొచ్చింది. గ్రామసభ అనుమతి లేకుండా అటవీ భూములను వివిధ ప్రాజెక్టులకు వినియోగించే ప్రక్రియకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. అటవీ పరిరక్షణ నిబంధనలకి 2022లో నోటిఫైడ్ చేస్తూ కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఆదేశాలు జారీ చేసింది. అడవుల్లో నివశించే గిరిజనుల అనుమతి అవసరం లేకుండా భూములు కేటాయింపు జరుగుతోంది. ఇది అత్యంత ప్రమాదకర మని ఇప్పటికే గిరిజన సంఘాలు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో అడవులను నమ్ముకుని కోట్లాదిమంది జీవిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. నదీ జలాలన్నీ ఏజెన్సీల్లోనే ఉన్నాయి. కానీ ఆదివాసీలకు రక్షిత మంచినీరు అందుబాటులో లేదు. ఏజెన్సీ గ్రామాలకు సంపూర్ణంగా విద్యుత్ సదుపాయం లేదు. ఈ సమస్యలను పరిష్కరించకుండా ఎన్ఇన హామీలు ఇచ్చినా గిరిజన సంక్షేమం నెరవేరదని పాలకులు గుర్తించాలి. కనీస సౌకర్యాల కల్పన విద్యవిద్యం వంటి విషయాల్లో అడుగులు పడాలి.

# బిసి రిజర్వేషన్లపై ఎందుకీ గలభా?

హైదరాబాద్,ఆగస్టు 7 భారత సమాజంలో తరతరాలుగా విద్యకు, భూమికి దూరంచేసి వెనుకవేయబడ్డ వర్గానికి స్వతంత్ర భారతదేశంలో సుమారు 50 సంవత్సరాల తర్వాత రిజర్వేషన్లు కల్పించబడ్డ రోజు. సామాజిక న్యాయం కోసం 40 సంవత్సరాలు వెనకబడ్డ వర్గాల పోరాటానికి గుర్తింపు లభించిన రోజు. లోక్‌సభలో మాజీ ప్రధాని విపి సింగ్ ఇతర వెనకబడ్డవర్గాల కోసం ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ప్రకటన జారీ చేసిన రోజు. నేడు దేశవ్యాప్త బిసి రిజర్వేషన్ల ఉద్యమానికి నాంది పలికిన రోజు. బిసిల 42 శాతం రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం హైదరాబాద్ ఇంద్రపార్క్ నుంచి ఢిల్లీలో జంతర్‌మంతర్‌కు చేరింది. తెలంగాణనే కాదు యావత్ భారతదేశం బిసిల 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయా, కావా? అనే ప్రశ్నతో వెయ్యి కండ్లతో ఎదురుచూస్తుంది. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు లేని పరిమితి బిసి రిజర్వేషన్లకు ఎందుకు? 2019 జనవరి నెలలో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం, రెండు సభలలో ఆమోదించడం, రాష్ట్రపతి సంతకం చేయడం, గజిట్‌లో ప్రచురించడం, అమలు కావడం చకచకా జరిగిపోయాయి. కానీ బిసిలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ రాష్ట్రం రెండు బిల్లులు పంపి ఆరు నెలలు గడుస్తున్నా నిర్ణయం తీసుకోవడంలో జాప్యం ఎందుకు? స్థానిక సంస్థలలో బిసిల 42% రిజర్వేషన్లు అమలు చేయాలని 2018 చట్టంలో సెక్షన్ 285ఎ కి సవరణ చేసి గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపిస్తే మళ్లీ ఆర్డినెన్స్ ఢిల్లీకి (రాష్ట్రపతి సలహా కోసం) చేరింది. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు లేని అగ్నిపరీక్ష బిసిల 42% రిజర్వేషన్లకు ఎందుకు? అసలు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు లేని 50% పరిమితి నిబంధన బిసి రిజర్వేషన్లు ఎందుకు? ఇడబ్యుఎస్ రిజర్వేషన్లను సుప్రీం కోర్టు సమర్థించింది, బిసి 42 శాతం రిజర్వేషన్లను సమర్థించదా? ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు తీర్పు. జనహిత్ అభియాన్ వర్సెస్ ఇండియా కేసులో 2022 నవంబర్ 7న ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను సుప్రీం కోర్టు 3:2 మెజార్టీ ద్వారా సమర్థించింది. ముఖ్యంగా ఈ కేసులో సుప్రీం కోర్టు స్పష్టపరిచిన అంశాల్లో ఆర్టికల్ 15(4), 16(4) కింద రిజర్వేషన్లు అసాధారణ పరిస్థితులలో తప్ప 50% మించకూడదు అనే తీర్పు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు (ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు వంటివి) వర్తిస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు కాదు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను విడిగా పరిగణిస్తారు. ఇడబ్ల్యుఎస్ కోటా (10%) ఇప్పటికే ఎస్‌సి, ఎస్‌టి లేదా ఒబిసి రిజర్వేషన్ల పరిధిలోకి రాని వారికి, ఎందుకంటే ఇది అదనంగా కనిపిస్తున్న రిజర్వేషన్లు. 103వ రాజ్యాంగ సవరణ ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ కోసం ఆర్టికల్స్ 15(6), 16(6)లను రాజ్యాంగానికి చేర్చింది కాబట్టి ఆమోదిస్తున్నాం. ఇది రాజ్యాంగంలో భాగం కాబట్టి, సుప్రీంకోర్టు గతంలో న్యాయపరంగా రూపొందించిన 50% నియమాన్ని అధిగమిస్తుందని తీర్పు ఇచ్చింది. తమిళనాడు వెనుకబడిన తరగతులు, ఎస్‌సి, ఎస్‌టిల చట్టం, 1993ను ఆమోదించింది. ఇది 69% రిజర్వేషన్లను కల్పిస్తుంది. న్యాయ సమీక్షనుండి రక్షించడానికి రాజ్యాంగంలోని 9షెడ్యూల్‌లో ఈ చట్టం చేర్చబడింది. 2018లో మహారాష్ట్ర ఎస్‌ఇబిసి (సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు) వర్గం కింద మరాఠాలకు 16% రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక చట్టాన్ని ఆమోదించింది. ఇది మొత్తం రిజర్వేషన్లను 70%కి పెంచింది. మే 2021లో సుప్రీంకోర్టు 50% పరిమితిని ఉల్లంఘించడానికి ఎటువంటి అసాధారణ పరిస్థితులు లేవని దానిని కొట్టివేసింది. రాజస్థాన్ గుజ్జర్లకు 5% రిజర్వేషన్లు, ఇతర ఒబిసిలకు 21% రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రయత్నించింది, దీనితో మొత్తం రిజర్వేషన్లు 70% కంటే ఎక్కువయ్యాయి. రాజస్థాన్ హైకోరు, సుప్రీం కోర్టు 50% పరిమితిని ఉల్లంఘించాయి. అసాధారణ పరిస్థితులను సమర్థించడానికి తగినంత డేటా లేదు




అని ఈ చట్టాన్ని కొట్టివేసాయి. బీహార్ ప్రభుత్వం నవంబర్ 2023 లో బీహార్ కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్లను 75%కి పెంచుతూ చట్టాన్ని ఆమోదించింది. పాట్నా హైకోర్టు అసాధారణ పరిస్థితులు ఉంటే తప్ప రిజర్వేషన్ 50% మించకూడదనీ, కుల సర్వే డేటాలో అసాధారణ పరిస్థితులు నిరూపించబడలేవనీ, అదనపు రిజర్వేషన్లను సమర్థించడానికి తగినంత బలమైన సామాజిక, -ఆర్థిక సూచికలు దీనికి లేవు అని కొట్టివేసింది. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, కృష్ణమూర్తి కేసులులో ఇచ్చిన ట్రిబుల్ టెస్ట్ తీర్పును, వివిధ రాష్ట్రాల్లో బిసి రిజర్వేషన్లపై హైకోర్టులు, సుప్రీం కోర్టు తీర్పులను ఇతర రాష్ట్రాల అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు (బిసిలు) 42% రిజర్వేషన్లను అమలు చేయడానికి నవంబర్-, డిసెంబర్ 2024లో తెలంగాణ సామాజిక,- ఆర్థిక, కుల సర్వే (ఎస్ఇఇఇపిసి)ని నిర్వహించింది, ఇది 96.9% గృహాలను కవర్ చేసింది. జనాభాలో బిసిలు 56.33% ఉన్నారని తేల్చింది. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా డేటాను విశ్లేషించడానికి, రిజర్వేషన్ సంస్కరణలను సిఫార్సు చేయడానికి బిసి కమిషన్ ఏర్పరచింది. మార్చి 2025లో, తెలంగాణ శాసనసభ విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో బిసి రిజర్వేషన్లను 42%కి పెంచడం (29% నుండి), పంచాయతీలు, మునిసిపాలిటీలు వంటి స్థానిక సంస్థలకు 42% కోటాను పెంచడం కోసం (18% ఎస్‌సి, 10% ఎస్‌టి కోటాలతోపాటు మొత్తం 70%కి తీసుకురావడం) రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించింది. పార్లమెంట్ అనుమతి కోసం ఢిల్లీకి పంపింది. జులై 2025లో తెలంగాణ మంత్రివర్గం తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285ఎని సవరించడానికి ఆర్డినెన్స్ జారీ చేయడానికి ఆమోదం తెలిపింది. గవర్నర్ ఈ ఆర్డినెన్స్‌ను 1 ఆగస్టు 2025న రాష్ట్రపతికి పంపారు. ప్రస్తుతం ఏం చేయాలి. బిసిల 42% రిజర్వేషన్లు అమలు కావాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సవరణ అవసరం. 50% పరిమితిని అధిగమించాలంటే అసాధారణ పరిస్థితుల్లో అధిగమించవచ్చు. 50 శాతం పరిమితి అనేది న్యాయపరమైన మినహాయింపే కాని రాజ్యాంగపరమైన మినహాయింపు కాదు. కాబట్టి 56.36% ఉన్న బిసిలకు తగినంత ప్రాతిధ్యం లేదని డెడికేట్ కమిషన్ ద్వారా రిపోర్టును సమర్పిస్తూ సమగ్ర సర్వే, శాస్త్రీయ డేటాను ముందు ఉంచే ప్రయత్నం చేయాలి. తమిళనాడు మాదిరిగా 42% బిసి రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి కోర్టుల నుంచి మినహాయింపు పొందవచ్చు (తొమ్మిదవ షెడ్యూల్లోని చట్టాలను న్యాయ సమీక్ష చేయవచ్చు). రాజ్యాంగ సవరణ కోసమే తెలంగాణ సమాజం ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేస్తుంది. ఇంత జరుగుతున్నా బిసి రిజర్వేషన్లకు మోక్షం లభించడం లేదంటే యావత్ భారతదేశం, తెలంగాణ సమాజం దానికి కారకులు ఎవరో నిర్ణయించుకోవాలి.

# ఇసి స్వతంత్రతపై నీలినీడలు...




న్యూఢిల్లీ,గత లోకసభ ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై రాహుల్ గాంధీ ఢిల్లీలో ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పిపిటి) సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఎన్నికల కమిషన్, బిజెపి కుమ్మక్కై ఎన్నికల అక్రమాలకు పాల్పడి ప్రజా తీర్పును అపహాస్యం చేశాయని ఆయన ఆరోపించారు. ఓట్ల చోరీ జరిగినట్లు రాహుల్ గాంధీ పిపిటి ద్వారా బహిర్గతపరిచిన అంశాలు ప్రజాస్వామ్య వాదులను, మేధావులను, విశ్లేషకులను దిగ్భ్రాంతికి గురిచేశాయి. కర్ణాటకలోని బెంగళూర్ సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో రాహుల్ గాంధీ బయటపెట్టిన ఎన్నికల అక్రమాలు భారత ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యానికి జీవనాడి వంటి ఓటు హక్కును అపహాస్యం పాలు చేసేలా బయటపడిన సంఘటనల పట్ల ప్రజలు విస్తుపోతున్నారు. ఓట్ల దొంగతనానికి పాల్పడి దేశంలోని అనేక లోకసభ స్థానాలను ఎన్నికల కమిషన్ మద్దతుతో బిజెపి గెలుచుకుని నిజమైన ప్రజాతీర్పును మంటగలిపిందని . రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. మహా దేవపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లో నకిలీ ఓటర్లు, గుర్తింపు లేని చిరునామాలు, పెద్ద మొత్తంలో ఓటర్లు ఒకే అడ్రస్‌లో ఉండటం, ఫోటో గుర్తించేలా లేని ఓటర్లు, ఫామ్ 16 దుర్వినియోగపరచటం లాంటి ఐదు అంశాలతో ఎన్నికల కమిషన్, బిజెపిలు ఎన్నికల ఫలితాలు తారుమారు చేసిన వైనాన్ని రాహుల్ ఎండగట్టాడు. రాహుల్ గాంధీ టీం మ్యాన్యువల్‌గా ఇసి ఇచ్చిన వేల కొలది ఓటర్ జాబితాలను గత కొన్నాళ్లుగా విశ్లేషించినట్లు అతని మాటలతో తెలుస్తోంది. మహాదేవపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లో నకిలీ ఓటర్లు 11,965 మంది, గుర్తింపు లేని చిరునామాలలో 40,009 మంది ఓటర్లు, ఒకే అడ్రస్‌లో ఉన్న ఓటర్లు 10,452 మంది, ఫోటో గుర్తింపు లేని ఓటర్లు 4,132 మంది, ఫామ్ 6ను దుర్వినియోగపరచిన వారు 33,692 మంది ఉన్నారన్నారు. మొత్తం 1,00,250 నకిలీ ఓట్లు ఉన్నట్లు తేల్చిచెప్పడంతో ఎన్నికల కమిషన్ పనితీరుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. బెంగళూర్ సెంట్రల్ లోకసభ నియోజకవర్గ పరిధిలోగల ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీకి 82,000 మెజారిటీ వచ్చింది. మిగిలిన మహాదేవపుర సెగ్మెంటులో బిజెపికి ఒక లక్ష 1,14,046 ఓట్ల మెజారిటీ రావడంతో 32,707 ఓట్ల మెజారిటీతో బిజెపి గెలిచింది. ఈ సెగ్మెంట్‌లో ఓ సింగిల్ బెడ్ రూమ్ ఇంటి చిరునామాపై 80 మంది, ఒకే గది ఉన్న మరో ఇంటిలో 46 మంది ఓటర్లు ఉన్నట్లు తేలడంతో ఎన్నికల అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో కళ్లకు కడుతున్నాయి. కంప్యూటర్లలో సులభంగా విశ్లేషించేందుకు అనువుగా ఉండే డిజిటల్ ఓటర్ల జాబితాలను ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరితే తిరస్కరించడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించుకుంటున్న ప్రస్తుత తరుణంలో డిజిటల్ ఓటర్ల జాబితాలు పబ్లిక్ డొమైన్‌లో ఉంటే ఓటర్ల జాబితాలలో ఉండే లొసుగులు బయట పడతాయనే ఉద్దేశంతోనే ఎన్నికల కమిషన్ నిరాకరిస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దేశంలోని ఒక్క మహాదేవపుర అసెంబ్లీ పరిధిలోనే ఇన్ని అక్రమాలు జరిగితే దేశవ్యాప్తంగా మరెన్నో అవకతవకలతో ప్రజాతీర్పుకు పాడె కడుతున్నారన్న అనుమానాలు ప్రజలలో వస్తున్నాయి. ఎన్నికల కమిషనర్ల నియామకపు బిల్లు 2023 డిసెంబర్ లో పార్లమెంట్ ఆమోదం పొందిన తరువాత భారత ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమిస్తాడు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం పార్లమెంట్ ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని రాజ్యాంగ నిబంధన ఆదేశించిన చట్టం రూపుదిద్దుకోలేదు. 1991లో పార్లమెంటు ఎన్నికల కమిషన్ చట్టాన్ని ఆమోదించింది. ఇందులో కేవలం ఎన్నికల కమిషనర్ల వేతనం, సేవా నిబంధనలు మాత్రమే ఆమోదం పొందాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియకు అవకాశం కల్పించలేదు. ప్రధానమంత్రి సిఫార్సుల మేరకే రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్ల నియామకాలు చేస్తున్నాడు. సుప్రీం కోర్టు అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా 2023 కేసులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల కమిషనర్లను నియమించడానికి పార్లమెంటు చట్టాన్ని రూపొందించాల్సిన బాధ్యత ఉందని పేర్కొంది. ప్రధానమంత్రి, లోకసభలో ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి తో కూడిన కమిటీ సలహా మేరకు రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లను నియమించాలని జస్టిస్ కెఎం జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు రుచించని ప్రభుత్వం ఆగమేఘాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, సేవా నిబంధనలకు సంబంధించిన బిల్లు తయారు చేసింది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి గతంలో గోస్వామి కమిటీ, లా కమిషన్ సూచనలు, సుప్రీం కోర్టు 2023లో చేసిన ఆదేశాలను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు 2023 డిసెంబర్ 12న రాజ్యసభ, డిసెంబర్ 21వ తేదీన లోకసభ ఆమోదంతో చట్టంగా అమల్లోకి వచ్చింది. చట్టం ప్రకారం సెలక్షన్ కమిటీ సిఫార్సు మేరకు ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమిస్తాడు. సెలక్షన్ కమిటీలో ప్రధానమంత్రి, కేబినెట్ మంత్రి, లోకసభలో ప్రతిపక్ష నాయకుడు ఉంటారు. దీని ప్రకారం ప్రభుత్వం (ప్రధానమంత్రి, కేబినెట్ మంత్రి) సూచించిన వ్యక్తులే ఎన్నికల కమిషనర్లుగా నియామకం అవుతారు. సెలక్షన్ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేబినెట్ మంత్రికి స్థానం కల్పించడంలోని నైతికతనే రాహుల్ గాంధీ గతంలో ప్రశ్నించడం జరిగింది. ముగ్గురు సభ్యులలో మెజారిటీ సూత్రం ప్రకారం ప్రతిపక్ష నాయకుడి సూచనకు అర్థమే లేకుండాపోతోంది. కేంద్ర ప్రభుత్వం తనకు నచ్చిన వ్యక్తులనే ఎన్నికల కమిషనర్లుగా నియమించుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇది ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బ తీస్తుందని ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో రాహుల్ గాంధీ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో జరిగిన అక్రమాల అవకతవకలపై ప్రశ్నించినప్పటికీ ఎన్నికల కమిషన్ నుంచి సరైన సమాధానం రాలేదు.

# ధర్మస్థల వ్యవహారంలో కానరాని పురోగతి

బెంగళూరు, ధర్మస్థలలో సిట్ దర్యాప్తు ఒకవైపు, తవ్వకాలు మరోవైపు కొనసాగుతున్నాయి. అయితే ఆధారాలు పెద్దగా లభించడం లేదు. తవ్వకాలు, తమకు దొరికిన ఎముకలు, ఇతర అవశేషాలకు సంబంధించి సిట్ అధికారులు వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. తవ్వకాలు చేస్తున్న చోటు-కు ఉప్పుమూటల్ని తీసుకువెళుతున్నారు. దొరికిన వాటిని సంచుల్లో ఉంచుకుని, వాటికి తెల్లవస్త్రాన్ని చుట్టి తీసుకువెళుతున్నారు. బెళ్తంగడి సిట్ కార్యాలయానికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి మణిపాల్ కేఎంసీకి పంపిస్తున్నారు. మణిపాల్ నుంచి బెంగళూరులోని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు ఆయా సంచులను చేరవేస్తున్న ఘట్టం నిగూఢంగా సాగుతోంది. ధర్మస్థలలో సిట్ చేపట్టిన కార్యాచరణకు, తమకు సంబంధాన్ని అంటగడుతూ కొన్ని ప్రచార మాధ్యమాలు, యూట్యూబర్లు చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆలయ ప్రముఖుడు హర్షేంద్రకుమార్ హెగ్గడే వేసుకున్న అర్జీని సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం తోసిపుచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ప్రశ్నిస్తూ ధర్మస్థల కార్యదర్శి హర్షేంద్ర కుమార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రచార మాధ్యమాలను నియంత్రించాలని పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయించవలసిన అవసరం ఏముందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని పీఠం అనుమానాన్ని వ్యక్తం చేసింది. మీమ్‌లు, అభ్యంతరకరమైన అంశాలపై కర్ణాటకలోని న్యాయస్థానంలో అర్జీ వేసుకోవాలన్నారు. మీకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయవలసిన అవసరం మాధ్యమ ప్రతినిధులకు ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఇకపోతే తాను వందలాది శవాలను పూడ్చి పెట్టానని ప్రకటించిన ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు భీమ సహకారంతో ప్రత్యేక దర్యాప్తు దళం సిట్ తవ్వకాలను కొనసాగిస్తోంది. అయిత అక్కడ పెద్దగా ఎలాంటి శవాల ఆనావాళ్లు కానరావడం లేదు. మొదట 13 ప్రాంతాలు, అనంతరం ఒక కొత్త ప్రదేశంతో పాటు, మరో మూడు ప్రాంతాలను ఆ వ్యక్తి చూపించాడు. వాటిలో మొదటి 12 ప్రాంతాల్లో తవ్వకాలు పూర్తిచేయగా, ఆరో ప్రాంతంలో మాత్రమే ఎముకలు లభించాయి. మరో చోట ఉరి వేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. 13వ ప్రాంతంలో తాను ఎనిమిదికిపైగా మృతదేహాలను పూడ్చి పెట్టానని ఆ వ్యక్తి చెప్పడం గమనార్హం. ఆ ప్రాంతాన్ని కాదని.. గురువారం కొత్తగా గుర్తించిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టినా ఏమీ లభించలేదు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భీమను సిట్ అధికారులు విచారించారు. అతను కొత్తగా చూపించిన మూడు ప్రాంతాల్లో ఒక చోట సాయంత్రం వరకు తవ్వారు. అయినా తాను మరో 30 ప్రాంతాలను చూపిస్తానని, అక్కడ తవ్వకాలు చేయాలని కోరాడు. జీపీఆర్ కోసం...: భీమ చూపించిన 13వ ప్రాంతంలో తవ్వకాలకు ముందస్తుగా జీపీఆర్ పరికరాన్ని వినియోగించి తవ్వకాలు కొనసాగించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం, జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకోవలసిన అవసరం ఉండడంతో ఆ ప్రదేశంలో తవ్వకాలు సాగలేదు. ఎవరూ అక్కడకు రాకుండా సాయుధదళాన్ని భద్రతకు నియమించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకుంటామని సిట్ అధికారి తెలిపారు. మొత్తంగా భీమ చెప్పిన ప్రాంతాల్లో ఎక్కడా బలమైన ఆధారాలు దొరకలేదు. దీంతో ఇప్పుడు భీమపై అనుమానాలు కూడా వస్తున్నాయి.

## ఆర్టీసీ నిర్వహణ నిమిత్తమే చార్జీల పెంపు

హైదరాబాద్,రాఖీ పండుగకు చార్జీలు పెంచడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్టీసీ నిర్వహన కారణంగా కొంత చార్జీలు పెంచినట్టు తెలిపింది. పండుగ తరువాత రేట్లు యథాయథంగా ఉంటాయని వెల్లడించింది. ఈ నెల 11 వరకు స్పెషల్ బస్సుల్లో చార్జీలు పెంచినట్లు వెల్లడించింది. ఆ తర్వాత చార్జీలు సాధారణంగానే ఉంటాయని పేర్కొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు లేకున్నా బస్సులను వెంటనే తిరిగి తీసుకురావాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చుల నిమిత్తం స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలు పెంచామని వెల్లడించింది. 'సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతికైనా రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే రూ.1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతూ.. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.' అని తెలిపింది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండుగ ప్రయాణికుల రద్దీ నెలకొంది. సికింద్రాబాద్ జేబీఎస్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

## గోవాలో తెలుగు జంటపై దాడి

హైదరాబాద్, గోవాలో మరో దారుణం చోటుచేసుకుంది.. గోవా విహార యాత్రలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఓ జంటపై పనాజీ బస్‌స్టాండ్ వద్ద దాడి జరిగింది. బైక్ అద్దె విషయంలో జరిగిన చిన్నపాటి వివాదం ఘర్షణకు దారి తీసింది. వరుసగా సెలవులు రావడంతో.. హైదరాబాద్ కు చెందిన ఈ జంట గోవాలో గడిపేందుకు వెళ్లారు. అక్కడ ప్రయాణానికి బైక్ అద్దెకు తీసుకున్నారు. ఒప్పందం ప్రకారం.. బైక్‌ను సమయానికి తిరిగి అప్పగించినప్పటికీ.. బైక్ అద్దెకు ఇచ్చినవాళ్లు అదనంగా రూ.200 చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఎందుకు చెల్లించాలంటూ వారు.. బైక్ అద్దెకు ఇచ్చిన వారిని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇరువురు మధ్య వాగ్వాదం తలెత్తింది.. ఈ క్రమంలో పనాజీ బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న కొంతమంది బైక్ అద్దెకు ఇచ్చే వ్యక్తులు గుంపుగా వచ్చి జంటపై దాడికి పాల్పడ్డారు.

# ఆగస్ట్ 15న అలస్కాలో భేటీ కానున్న ట్రంప్, పుతిన్

న్యూఢిల్లీ, ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఆగస్ట్ 15న అలస్కాలో ఈ భేటీ జరగనున్నట్లు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. గత కొంతకాలంగా ఉద్రిక్తంగా ఉన్న ఉక్రెయిన్ యుద్ధానికి ఈ సమావేశం ఒక ముగింపు పలుకుతుందని ప్రపంచ దేశాలు ఆశిస్తున్నాయి. గత మూడు రోజులుగా చోటుచేసుకున్న వేగవంతమైన పరిణామాల అనంతరం ఈ భేటీ ఖరారైంది. "ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమావేశం ఆగస్ట్ 15, శుక్రవారం నాడు అలస్కాలో జరుగుతుంది" అని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. ఈ సమావేశం భారత్‌కు కూడా ఎంతో కీలకం కానుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాషింగ్టన్, భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాల భవిష్యత్తు ఈ భేటీతో తేలే అవకాశం ఉంది. ఈ పరిణామాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతించింది. అమెరికా, రష్యా మధ్య కుదిరిన ఈ అవగాహనను అభినందిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "ఈ సమావేశం ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికి, శాంతికి అవకాశాలు కల్పిస్తుందని ఆశిస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ అనేకసార్లు చెప్పినట్లుగా 'ఇది యుద్ధాల యుగం కాదు'" అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ శాంతి ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. శిఖరాగ్ర సమావేశానికి ముందు రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని నరేంద్ర మోదీతో శుక్రవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ అంశంపై అమెరికాతో జరిగిన చర్చల వివరాలను ఆయన మోదీకి వివరించారు. భారత్-రష్యా మధ్య ఉన్న ప్రత్యేక భాగస్వామ్యం దృష్ట్యా, అమెరికా అధ్యక్షుడి ప్రత్యేక దూత స్టీవెన్ విట్కాఫ్‌తో జరిగిన సమావేశంలోని కీలక అంశాలను పుతిన్ పంచుకున్నారని రష్యా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. పుతిన్ అందించిన వివరాలకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ, వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొనాలన్నదే భారత్ స్థిరమైన వైఖరి అని పునరుద్ఘాటించారు. ఈ సమావేశానికి ట్రంప్ ప్రత్యేక దూత స్టీవెన్ విట్కాఫ్, పుతిన్‌తో మాస్కోలో జరిపిన చర్చలే పునాది వేశాయి. ఈ చర్చల అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, పుతిన్‌తో సానుకూల చర్చలు జరిగాయని, శాంతి నెలకొనేందుకు మంచి అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇరు దేశాల ప్రయోజనాల కోసం కొన్ని భూభాగాల మార్పిడి కూడా ఉండొచ్చు" అని ట్రంప్ వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

# పదవీకాలం ముగిసినందున జోక్యం చేసుకోలేం

హైదరాబాద్,వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి పదిహేనేళ్లుగా కొనసాగుతున్న పౌరసత్వ వివాదానికి సుప్రీంకోర్టు శుక్రవారం ముగింపు పలికింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రమేశ్ పోటీ చేసిన ఎన్నికల పదవీకాలం ఇప్పటికే ముగిసిపోయినందున, ఆ విషయాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఆది శ్రీనివాస్ తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ, రమేశ్ దేశాన్ని మోసం చేసినట్లు హైకోర్టు గుర్తించినప్పటికీ ఆయన ఇప్పటికీ పింఛనుతో సహా ఇతర శాసనసభ ప్రయోజనాలను పొందుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, సుప్రీంకోర్టు ఈ వాదనలను పరిగణనలోకి తీసుకోలేదు.చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరసత్వం కలిగి ఉండి, ఆ విషయాన్ని దాచిపెట్టి ఎన్నికల్లో పోటీ చేశారని ఆరోపిస్తూ ఆది శ్రీనివాస్ 2019లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, నిబంధనలు పాటించలేదన్న కారణంతో 2019 నవంబరులో రమేశ్ భారత పౌరసత్వాన్ని రద్దు చేసింది. కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ రమేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, 2024 నవంబర్ 6న కీలక తీర్పు వెలువరించింది. రమేశ్ జర్మన్ పౌరుడేనని నిర్ధారిస్తూ, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయడానికి, ప్రజా పదవులు చేపట్టడానికి అనర్హుడిగా ప్రకటించింది. 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించినందుకు ఆయనకు రూ. 30 లక్షల జరిమానా కూడా విధించింది. ఇందులో రూ. 25 లక్షలు ఆది శ్రీనివాస్‌కు, రూ. 5 లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించగా, రమేశ్ ఆ మొత్తాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో చెల్లించారు.2009 నుంచి 2018 వరకు జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ రమేశ్ గెలుపొందగా, ఆది శ్రీనివాస్ రెండో స్థానంలో నిలిచారు. రమేశ్‌ను అనర్హుడిగా ప్రకటించినందున, ఆ పదవీకాలాలకు తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని శ్రీనివాస్ కోరారు. అయితే హైకోర్టు దీనిపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆయన అభ్యర్థనను తిరస్కరించడంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది. కాగా, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ రమేశ్‌కు టికెట్ నిరాకరించగా, వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆది శ్రీనివాస్ విజయం సాధించారు.

# మేం లేకుండా శాంత చర్చలా?

న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరగనున్న శిఖరాగ్ర సమావేశాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ శనివారం తీవ్రంగా వ్యతిరేకించారు. ఉక్రెయిన్ ప్రత్యక్ష ప్రమేయం లేకుండా కుదిరిన ఏదైనా ఒప్పందం అసమర్థమైనది, ప్రమాదకరమైనది అని అన్నారు. ఈ శుక్రవారం అలాస్కాలో జరగనున్న ఈ సమావేశం ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించే దిశగా ఒక సంభావ్య అడుగుగా అభివర్ణించబడుతోంది. అయితే అమెరికా, రష్యా మధ్య ద్వైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే శాంతిని సాధించవచ్చనే భావనను జెలెన్స్కీ ఖండించారు.తన అధికారిక టెలిగ్రామ్ ఖాతాకు పోస్ట్ చేసిన సందేశంలో ఉక్రేనియన్ నాయకుడు తన రాజ్యాంగం ద్వారా రక్షించబడిన దేశ ప్రాదేశిక సార్వభౌమాధికారం చర్చలకు అర్హమైనది కాదని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్ రష్యాకు తాను చేసిన పనికి ఎటువంటి అవార్డులు ఇవ్వదు అని జెలెన్స్కీ అన్నారు. ఉక్రేనియన్లు తమ భూమిని ఆక్రమణదారునికి ఇవ్వరు. ఉక్రెయిన్ లేని ఏవైనా పరిష్కారాలు అదే సమయంలో శాంతికి వ్యతిరేకంగా పరిష్కారాలు. అవి ఏమీ తీసుకురాలేవు. ఇవి నిర్జీవ పరిష్కారాలు అవి ఎప్పటికీ పనిచేయవు అని పేర్కొన్నారు. జెలెన్స్కీ వ్యాఖ్యలు ఉక్రెయిన్, యూరప్‌లో పెరుగుతున్న ఆందోళనలను ప్రతిబింబిస్తున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశంలో ఉక్రెయిన్‌ను పక్కనపెట్టి శాంతి ప్రక్రియను ఉక్రెయిన్, యూరోపియన్ ప్రయోజనాల నుండి దూరం చేయగలదని ఆందోళన చెందుతున్నారు. జెలెన్స్కీతో సంప్రదించే ముందు పుతిన్‌తో కలవాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఆ ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది.

# బీఆరెస్ పాలిట ట్రాజెడీగా మారిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ

హైదరాబాద్,రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ సందర్భంగా బీఆర్ఎస్ పరిస్థితి కుడితిలోపడ్డ ఎలుక మాదిరిగా మారుతోంది. తమ హయంలో పూర్తి చేసిన ప్రాంతాల్లో కూడా పంపిణీ చేయకపోవడం ఆ పార్టీకి ఇప్పుడు శాపమైంది. పైకి కక్కలేరు%ా% మింగలేరు%ా% కాకుంటే నిర్మాణం మేం చేస్తే, మీరు ప్రారంభించి సంకలు గుద్దుకుంటున్నారంటూ విమర్శించి తమను తాము ఓదార్చుకుంటున్నారనే సెటైర్లు వినిపిస్తున్నాయి. నిజమే.. కొన్నిచోట్ల ఇండ్లు బీఆర్ఎస్ హయంలోనే నిర్మించినప్పటికీ.. వాటిని పేదలకు ఎందుకు పంపిణీ చేయలేదు? అవకాశం ఉన్నా మీరెందుకు పూర్తిచేసి ప్రారంభించలేదు? అంటూ ఎదురు ప్రశ్నిస్తే.. తమ పార్టీ శ్రేణులను సంతృప్తిపరిచేందుకు డొంకతిరుగుడు సమాధానాలు చెబుతున్నారంటూ కాంగ్రెస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఉండి చేయకపోగా, ఇప్పుడు కాంగ్రెస్ ను విమర్శించడం వల్ల ఒనగూరే ప్రయోజనం లేదంటున్నారు.

రాజకీయ చిత్తశుద్ధి ప్రధానం

బీఆర్ఎస్ హయంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టినపుడు చూపిన నిజాయతీ ఆ తర్వాత పూర్తి చేసి, పంపిణీ చేయడంలో లోపించిందనే ప్రశ్నకు ఆ పార్టీ నాయకులనుంచి సమాధానం లేదు. కొన్ని పనులు చేపట్టిన సందర్భాల్లో అనుకోని అవాంతరాలు ఎదురవుతుంటాయి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో తెలిసిమరీ పంపిణీ ఆపివేశారు. అర్థాంతరంగా పథకాన్ని నిలిపివేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ఇండ్ల పంపిణీ పూర్తి చేస్తుంటే విమర్శలు చేయడం చిత్తశుద్ధిలోపంగా రాజకీయ పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ ఇండ్ల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య క్రెడిట్ వార్ సాగుతోంది. ఈ అంశంలో బీజేపీ కూడా తమ వాటా క్రెడిట్ కోరుతోంది. ఎవరికి వారు తమ ఖాతాలోనే వేసుకునేందుకు మూడు పార్టీల నాయకులు ప్రయత్నిస్తున్నారు. స్థానిక ఎన్నికల వేళ ఓటు బ్యాంకు రాజకీయం చేస్తున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ట్రాజెడీ

ఒక మాటలో చెప్పాలంటే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అనేది కేసీఆర్ మానస పుత్రిక, తెలంగాణ ఉద్యమ సమయంలోనే ఒక నినాదంగా మారిన ప్రజాకర్షణీయ కార్యక్రమం. కాంగ్రెస్ నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లపై వ్యంగ్యాస్త్రాలు వేస్తూ 'అల్లుడొస్తే.. మేక పిల్ల ఉంటే' అంటూ కేసీఆర్ చిన్న పిట్ట కథే చెప్పేవారు. తాము డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామంటూ గూడులేని పేదలకు 'ఇంద ధనస్సు ఇల్లు' చూపెట్టారు. రాష్ట్రం వచ్చింది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇక పేదల సొంత డబుల్ బెడ్ రూమ్ కల తీరినట్లేనని అనుకున్నారు. అనుకున్నట్లుగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టింది. వరంగల్ లాంటి నగరంలో పేదల గుడిసెవాసులను తొలగించి అద్భుత కాలనీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో జర్నలిస్టుకాలనీ కూడా ఉంది. అనుకున్నట్లుగా శుక్రవారం ప్రారంభించిన అంబేద్కర్ నగర్‌లో ఏడేండ్ల క్రితమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించారు. దేశాయిపేట, పైడిపల్లి, దూపకుంటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ సహా అన్ని నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టారు. పలు చోట్ల చిన్నచిన్న పనులు మినహా మొదటి టర్మ్ ముగిసేనాటికే పూర్తయ్యాయి.



రేపోమాపో ఇండ్లొస్తాయని ఆశించారు. కానీ అది జరుగలేదు.

పట్టించుకోని బీఆర్ఎస్

ఎన్నికలకు ముందు ఇండ్లు పంపిణీ చేస్తారని పేదలతోపాటు ఆ పార్టీ కేడర్ కూడా ఆశించారు. ఎమ్మెల్యేలు పంపిణీని పెండింగ్ పెట్టారు. ఎన్నికలు పూర్తయ్యాయి. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. మెజార్టీ స్థానాల్లో పాత ఎమ్మెల్యేలే తిరిగి విజయం సాధించారు. విజయోత్సవాల తర్వాత తొలి కార్యక్రమం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీయే అనుకున్నారు. కానీ.. అది మళ్లీ పెండింగ్‌లో పడింది. ఇక అప్పటి నుంచి డబుల్ బెడ్ రూమ్‌లనేది కొందరికి ఒక ఆదాయవనరుగా మారింది. పార్టీలోని దళారులు, అనుచరులు, కొన్నిచోట్ల ఎమ్మెల్యేలే ఏకంగా లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసే పనిని చేపట్టారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. పలు చోట్ల జనం ఇండ్లను ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొన్ని కాలనీలు అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారాయి. దర్వాజాలు, కిటికీలు మాయమయ్యాయి. మధ్యలో పథకానికే మంగళపాడారు. పేదల ఆశలు నీరుగార్చారు. ఎన్నికలకు ముందు 'గృహలక్ష్మీ' పథకాన్ని ప్రకటించి వేలాది మంది లబ్ధిదారులను ప్రకటించారు. 2023 ఎన్నికల నాటికి కూడా డబుల్ బెడ్ రూములను పడావుబెట్టారు. ఆశావహులు, పార్టీ శ్రేణుల జాబితా చాంతడంతై ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారడంతో చేతులెత్తేశారు.

కాంగ్రెస్ కు పంపిణీ చాన్స్

రాష్ట్రంలో అధికారం మారింది. కాంగ్రెస్ చెప్పినట్లుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించింది. ఇదే సమయంలో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆగస్టు 15 నాటికి పూర్తి చేసేందుకు నిర్ణయించి ఆ పనిలో నిమగ్నమయ్యారు. పూర్తికాని ఇండ్లకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించారు. ఇప్పుడు బీఆర్ఎస్ నోట్లో వెలక్కాయపడింది. ఇపుడు లబ్ధిదారుల జాబితాలో అయితే అర్హులైన పేదలు, లేకుంటే కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యం దక్కుతున్నదనే మాటలు వినిపిస్తున్నాయి. ఇంతకాలం ఇండ్లపై ఆశలు పెట్టుకున్న బీఆర్ఎస్ శ్రేణులకు చుక్కెదురవుతోంది. తమ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేస్తే తమకే ప్రాధాన్యం దక్కేది కదా? అనే అవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల పాత నాయకులే పార్టీ మారి ఇండ్లు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు మాత్రం ఇదంతా తమ ఘనతేనంటూ చెప్పుకుని ఆత్మసంతృప్తి చెందుతున్నారు. ఇదిలా ఉండగా కేంద్రం నిధులతోనే ఈ ఇండ్ల నిర్మాణం సాగుతోందని బీజేపీ నాయకులు అంటున్నారు.

# నేరం చేయకపోయినా తప్పని నిర్బంధం



న్యూఢిల్లీ,ఢిల్లీ మాజీమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత సత్యేంద్ర జైన్‌ను ఢిల్లీ రోస్ అవెన్యూ కోర్టు ఆయనపై మోపిన అవినీతి కేసులో ఎలాంటి ఆధారాలు సిబిఐ చూపలేకపోయినందుకు కేసు కొట్టివేసి కేసులో నిర్దోషిగా తేల్చేసింది. ఢిల్లీలో రెండవసారి అత్యధిక మెజారిటీతో కేజ్రీవాల్ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా అధికారంలోకి వచ్చిన ఆప్‌నేత, ప్రజా పనుల శాఖామంత్రి సత్యేంద్ర జైన్‌పైనే అవినీతి నేరం మోపి మొదట జైలుపాలు చేశారు. ఒక రకంగా కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం కేజ్రీవాల్‌పై మద్యం కేసు కట్టడానికి ముందు ట్రయల్ రన్ సత్యేంద్ర జైన్ అని చెప్పవచ్చును. ఈయనపై 17 మంది కార్పొరేట్ సిబ్బంది నియామకం విషయంలో అవినీతికి పాల్పడినట్లు బిజెపి ఆరోపించడం, ఆ వెంటనే ఆ ఫైలుపై సంతకం చేసిన లెఫ్టినెంట్ గవర్నర్‌నే సిబిఐ విచారణకు ఆదేశించడం జరిగింది.అంతేకాదు జైలులో ఉన్న సుఖేష్ చంద్రశేఖర్‌తో ఓ లేఖ రాయించి మనీలాండరింగ్ కేసు కూడా నమోదు చేయించారు. ఇడి విచారణకు ఆదేశించారు. అవినీతి కేసులో సత్యేంద్ర జైన్‌ను రెండు సంవత్సరాలు విచారణ పేరుతో జైలులో నిర్బంధించడం, అనారోగ్యంతో ఉన్న వృద్ధుడు అని కూడా చూడకుండా బెయిల్ నిరాకరించడం చేశారు. చివరకు ఢిల్లీ ఎన్నికల్లో ఈ కేసు అపవాదు మూలంగానే ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇంతవరకు బాగానే ఉంది. బిజెపి పార్టీ ఎన్నికల అవసరం ముగిసిపోయింది. నాలుగు సంవత్సారాల తర్వాత ఢిల్లీ రోస్ అవెన్యూ కోర్టు సత్యేంద్ర జైన్ నిర్దోషిగా తేల్చి కేసు కొట్టివేసింది. 17 మంది నియామకం నిబంధనలు ప్రకారమే, మెరిట్ ప్రకారమే జరిగిందని, ప్రజలు అవసరార్థమే ఉద్యోగ నియామకాలు జరిగాయి.ఒక్కపైసా అవినీతి జరగలేదని సిబిఐనే తేల్చిచెప్పింది? ఆయన గత నాలుగేళ్ళుగా అనుభవించిన భౌతిక, నైతిక హింసకు ఇప్పుడు జవాబుదారీ ఎవరు? బిజెపినా? లెఫ్టినెంట్ గవర్నరా? సిబిఐ నా? ఎవరు ఆయనపై జరిగిన చట్టబద్ధం హింసకు, ప్రజాస్వామ్య హననానికి బాధ్యత వహించాలి. ప్రాయశ్చిత్తం చేసుకోవాలి? బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటినుండి ప్రత్యర్థులపై కేసులు నిత్యకృత్యమయ్యాయి. అదే బాటన రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యర్థులపై కేసులు మీద కేసులు పెడుతున్నా కేంద్రం ఏమీ చేయలేని నిస్సహాయతలో ఉంది. ఎందుకంటే తాను నేర్పిన విద్యనే కదా నీరజాక్షా! అనే స్థితి తెలుగు రాష్ట్రంలో ఉంది. భీమా కోరెగావ్ కేసు, అర్బన్ నక్సల్స్‌నుంచి మొదలైన ప్రజాస్వామ్య హననం. చివరకు ప్రత్యర్థి పార్టీలు వరకూ విస్తరించింది. స్టాన్ స్వామి లాంటి క్రిస్టియన్ ఫాదర్‌ను సైతం జైలులో కనీసం సౌకర్యాలు కల్పించలేదు.పక్షవాతంతో కదలలేని స్థితిలో ఆయన ఇబ్బందిపడ్డారు. చివరకు కన్నుమూశారు. అర్బన్ నక్సల్స్ పేరుతో ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబా లాంటి పూర్తి కదలలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడిని కూడా దశాబ్దకాలంగా అండా జైలులో నిర్బంధించిన వైనం మనం చూశాం. ఆయన నిర్దోషిగా బయటకు వచ్చిన కొద్దికాలంలోనే ఆయన చనిపోయారు. ఈ మరణాలకు జవాబుదారీ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరు? తెలంగాణ రచయిత, విరసం నేత వరవరరావును అండర్ ట్రయల్ ఖైదీగా జైలు నిర్బంధంలో ఉంచారు. కనీసం అనారోగ్యంతో వృద్ధుడుగా ఉన్న ఆయన్ను కనీసం కుటుంబం తో కలిసి ఉండే అవకాశం కల్పించడం లేదు? వీరంతా నేరస్థులేం కాదు? చట్టంలో ఉన్న లొసుగులు ఉపయోగించుకొని వేల పేజీల చార్జిషీట్‌లు వేయడం, అది చదువుకునేలోపు ఆ న్యాయమూర్తి బదిలీ కావడం, తిరిగి మరలా కేసు విచారణ తంతు మొదటికే రావడం ఇలా ఏళ్ళ తరబడి కేసులు సాగదీస్తూ అండర్ ట్రయల్ ఖైదీలుగా ఉన్నారు.ఫలితంగా అండర్ ట్రయల్ ఖైదీలుగా శిక్ష విధించకుండానే శిక్ష అనుభవిస్తున్నారు. ఎమర్జెన్సీ కాలంలో కూడా చవిచూడని నిర్బంధం ప్రస్తుతం దేశంలో అమలు జరుగుతున్నది. భీమా కోరెగావ్ కేసులో అరెస్టు అయిన వారిని విడుదల చేయాలని ఢిల్లీలో ప్రముఖ మేధావులు 50 మంది సంతకాలతో హోం మంత్రి అమిత్ షాకు మెమొరాండం ఇస్తే! మెమొరాండంపై సంతకాలు చేసిన వారిపై ఎఫ్ఐఆర్ చేయమని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. వినతి పత్రం ఇస్తే అరెస్టు చేయండి అని ఆదేశించిన చరిత్ర ఇదే ప్రథమం కావడం విశేషం! దీనిపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు నిరసన తెలపడంతో కేంద్ర హోం శాఖ రచయితలపై కేసు విషయంలో వెనకడుగు వేసింది. కానీ, దేశవ్యాప్తంగా నిరసన తెలిపిన ప్రజాస్వామ్యవాదులు పైన మాత్రం కేసులు పెట్టి ఉపసంహరణ చేయలేదు? నేటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.గత ఆరేడు సంవత్సరాలుగా సంఘ్ పరివార్ ఎజెండాను వ్యతిరేకించే వామపక్షశక్తులు, ప్రతిపక్ష పార్టీలుపై నిర్బంధం అప్రకటిత ఎమర్జెన్సీ రూపంలో కొనసాగుతున్నది.రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన సిబిఐ, ఇడి, ఐటి లాంటి సంస్థలపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు 75 ఏళ్ళ స్వర్ణోత్సవం జరుపుకోవాలసిన ఎన్నికల కమిషన్ స్వతంత్రత విషయంలో కూడా బీహార్ స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అమలు చేయడం సైతం వివాదాస్పదం అయింది. వాస్తవంగా ఢిల్లీ ఎన్నికల సమయంలోనే ఎన్నికల కమిషన్ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అది కాస్తా బీహార్ ఎన్నికల విషయంకు వచ్చేసరికి ఎస్ఐఆర్ నిబంధనల రూపంలో ఓటర్ల తొలగింపు రూపం తీసుకుంది. ప్రతిపక్షాలు ఎన్నికల బహిష్కరణ ఆలోచన వరకు వెళ్ళడం అనేది సాధారణ అంశం కానేకాదు. బీహార్ వెనుకబడిన వర్గాలు అధికంగా ఉండడంతో పాటు, రాష్ట్రం నుండి నాలుగైదు నెలలపాటు వలస వెళ్ళే భవన నిర్మాణ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.బీహార్‌లో సర్వేలు ప్రతిపక్షానికి అనుకూలంగా మారుతున్న దశలో ఇప్పటికిప్పుడు పౌరసత్వం కార్డు బయటకు తీసి (ఎస్ఐఆర్) అమలు జరపడం విమర్శలకు తావిస్తుంది. మునుపెన్నడూ లేని విధంగా రాజ్యాంగంలో స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ లాంటి సంస్థలపై విమర్శలు రావడం అంత వాంఛనీయం కానేకాదు? ఎన్నికల ముందు ఢిల్లీ, జార?ండ్ ముఖ్యమంత్రుల పై కేసులు నమోదు కావడం, అరెస్టులు చేసి జైళ్ళలో నిర్బంధం విధించడం లాంటి చర్యలు పాతవే అయినా కేసులనమోదులో అనేక అనుమానాలు పొడచూపుతున్నాయి. చివరకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై సైతం పలు కేసులు నమోదు అయ్యాయి. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలుపై నిర్బంధం పెరిగిన దశ కనపడుతున్నది. అయితే, సిబిఐ, ఇడి పెట్టిన కేసుల్లో 90 శాతం శిక్షలు ఖరారు కాకపోవడం, అనేక ఇబ్బందులు అనంతరం కేసులు సరైన సాక్ష్యం లేక కొట్టివేసిన పరిస్థితుల్లో? జరిగిన నష్టానికి ఎవరు జవాబుదారీ వహిస్తారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి విషయాలు ఎంత మాత్రం అనుసరణీయం, అనుకరణీయం కానీ, కానేకాదు!

# సేవింగ్స్ ఖాతా బ్యాలెన్స్ 50వేలు

న్యూఢిల్లీ, ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ తన సేవింగ్స్ ఖాతాల కనీస సగటు- బ్యాలన్స్ నిబంధనల్లో భారీ పెంపు చేస్తున్నట్లు- ప్రకటించింది. ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ మార్పు మెట్రో, అర్బన్, సెమి-అర్బన్, గ్రామీణ బ్రాంచ్‌ల ఖాతాదారులందరిపై ప్రభావం చూపనుంది. ఈ పెంపుతో దేశీయ బ్యాంకులలో అత్యధిక 'కనీస సగటు- బ్యాలన్స్' ఐసీఐసీఐ బ్యాంక్‌దే అవుతోంది. కొత్తగా సవరించిన నిబంధనల ప్రకారం.. మెట్రో, అర్బన్ ప్రాంతాల ఖాతాదారులు సగటు-న 50,000 కనీస నిల్వ ఉంచాలి. ఇది ఇంతకుముందు ఉన్న 10,000 నుంచి 50,000 కు పెరగడంతో.. ఐదు రెట్లు- పెరిగినట్టే. సెమి-అర్బన్ బ్రాంచ్‌లలో కనీస బ్యాలెన్స్ 5,000 నుంచి 25,000కు పెరిగింది. అలాగే గ్రామీణ బ్రాంచ్‌లలో మాత్రం 2,500 నుంచి 10,000కు పెంచారు. ఇకపోతే, దేశంలోనే అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2020లోనే మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనను పూర్తిగా రద్దు చేసింది. ఇతర బ్యాంకులు సాధారణంగా 2,000 నుంచి 10,000 వరకు మాత్రమే ఉంచేలా నిబంధనలు అమలు చేస్తుంటాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మెట్రో, అర్బన్‌లో 10,000, సెమి-అర్బన్‌లో 5,000, గ్రామీణ బ్రాంచ్‌లలో 2,500గా ఉంచింది. బ్యాంకులు తమ రోజువారీ కార్యకలాపాలు, పెట్టు-బడుల ఖర్చులను తీర్చుకునేందుకు మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనలను అమలు చేస్తాయి. ఈ పరిమితి కంటే తక్కువ నిల్వ ఉంచిన ఖాతాదారులపై జరిమానాలు కూడా వేస్తుంటాయి. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఆగస్టు 1 నుంచి కొత్త నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత సవరించిన ఫీజు చార్ట్ ప్రకారం జరిమానాలు విధించనుంది.

# వైఎస్ సునీతారెడ్డి ఆవేదన అర్థంచేసుకోవాలి

విజయనగరం, తన తండ్రి మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఆరేళ్ల అయినా తమ కుటుంబానికి న్యాయం జరగలేదంటున్న వైఎస్ సునీత రెడ్డి ఆవేదనను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తన తండ్రిని హత్య చేసిన వారు.. దానికి సహకరించిన వారు.. రాజకీయాల నీడలో పబ్లిక్‌గా తిరుగుతుంటే ఎవ్వరు ఏమి చెయ్యలేని పరిస్థితి నెలకొందని ఆమె ఆందోళన చెందుతున్నారన్నారు. హైకోర్టులో 6 కేసులు, సుప్రీంకోర్టులో 6 కేసులు ఉన్నాయని,ఆమె చెబుతున్నారని ఒక ఆడపిల్ల ఆధారాలతో ఎవరు హత్య చేశారో, దానికి ఎవరు సహకరించారో,ఎవరు తమ కుటుంబాన్ని ఎలా తప్పుత్రోవ పట్టించారో వివరాలతో ప్రాణాలకు తెగించి బయట పెడుతున్నా,పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ,కేంద్ర దర్యాప్తు సంస్థలు త్వరగతిన న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరగా తగిన న్యాయం సునీత రెడ్డికి జరిగేలా చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు. రాజకీయాల్లో వివేకా హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోందని,దర్యాప్తు సంస్థలు మొద్దు నిద్రలో ఉన్నట్టు- కనిపిస్తోందని భీశెట్టి ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా కుట్రలు ఛేదించడంలో విఫలం కావడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్టు- ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకి మంచిది కాదన్నారు.

# భారీ వర్షాల భయం పోతుందా?

హైదరాబాద్, హైదరాబాద్‌లో ఒక్కసారిగా కురిసే భారీ వర్షాలు, రోడ్లు నదుల్లా మారడం, లోతట్టు ప్రాంతాలు ముంపులో మునగడం.. ఇవన్నీ ప్రతి మాన్సూన్ సీజన్‌లో పునరావృతమవుతున్నాయి. కానీ, ఇకపై నగరానికి ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక భారీ మిషన్ ప్రారంభించబోతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ప్రణాళికకు నాయకత్వం వహిస్తూ, ఇప్పటి పనులు ఈ తరం కోసం మాత్రమే కాదు, వచ్చే వందేళ్ల తరాల కోసం అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు.

భారీ వర్షాల బీభత్సం.. నగరానికి ముందస్తు హెచ్చరిక

ఇటీవల హైదరాబాద్‌లో ఒకే రాత్రిలో 15 సెంటీమీటర్ల వర్షం పడింది. తక్కువ సమయంలో కురిసిన ఈ వర్షం రోడ్లను ముంచేసి, ట్రాఫిక్‌ను స్తంభింపజేసింది. లోతట్టు ప్రాంతాల్లోని వందలాది ఇళ్లు నీట మునిగాయి. ఈ పరిస్థితులు వాతావరణ మార్పుల వల్ల మరింత తీవ్రం అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా మూడు నెలల్లో పడే వర్షం ఇప్పుడు ఒకే రోజులో పడుతోంది. దీనిని తట్టుకునే శాశ్వత పరిష్కారం కోసం సీఎం ఆదేశాలు జారీ చేశారు.

వ్యవస్థల పూర్తి 'ప్రక్షాళన' ఆదేశం

ప్రస్తుతం నగరంలోని రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షాన్ని కూడా భరించలేవు. కానీ ఇప్పుడు ఒక్కసారిగా 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదవుతోంది. ఈ నేపథ్యంలో తాగునీరు, వరదనీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వంటి అన్ని వ్యవస్థలను పూర్తిగా అప్‌డేట్ చేసి, వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్.. ప్రధాన ఆయుధం

హైదరాబాద్‌లో వరద సమస్యకు మూసీ పునరుజ్జీవనమే శాశ్వత పరిష్కారం అని సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ కింద 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించనున్నారు. హుస్సేన్‌సాగర్, దుర్గం చెరువు, మీర్ అలం చెరువు వంటి ప్రధాన జలాశయాలను నాలాల ద్వారా మూసీతో అనుసంధానం, నాలాల వెడల్పు ప్రక్రియ వేగవంతం చేయడం, కలుషిత నీటి ప్రవాహాన్ని పూర్తిగా ఆపి, శుద్ధి చేసిన నీరు మాత్రమే మూసీకి చేరేలా సిస్టమ్ అమలు, ఈ చర్యలు పూర్తయితే నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపు సమస్య నుండి పూర్తిగా బయటపడతాయి.

చెరువుల పునరుద్ధరణ - వరద నీటి నిల్వ భద్రత

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్‌తో పాటు నగరంలోని చెరువులు, కుంటలను కూడా పునరుద్ధరించనున్నారు. హుస్సేన్‌సాగర్, దుర్గం చెరువు, మీర్ అలం చెరువుతో పాటు చిన్నచిన్న చెరువులు కూడా నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయబడతాయి. దీనివల్ల వర్షపు నీరు నేరుగా కాలనీల్లోకి చేరకుండా, చెరువుల ద్వారా నిల్వవుతుంది.

వందేళ్ల వరద రక్షణ వ్యూహం

ఎంత వర్షం పడినా, గ్రేటర్ హైదరాబాద్‌లో నీరు నిల్వ కాకూడదు, లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురి కాకూడదని సిఎం అన్నారు. దీనికోసం ఆధునిక డ్రైనేజ్ నెట్‌వర్క్, చెరువుల అనుసంధానం, మూసీ పరిరక్షణ, మరియు సముద్ర మట్టానికి సరిపడే ఇంజనీరింగ్ సొల్యూషన్లు ఉపయోగించబడతాయి.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత చెక్

వర్షాల సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోందని గుర్తించిన సీఎం, ముఖ్యంగా పాతనగరంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో పెడెస్ట్రియన్ జోన్ ఏర్పాటు చేయాలన్నారు. మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్‌లతో పార్కింగ్ సమస్యకు పరిష్కారం, వర్షాకాలంలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు.

పజల భద్రత.. ప్రథమ ప్రాధాన్యం

వర్షాలు, వరదల సమయంలో నగరవాసుల ప్రాణాలు, ఆస్తులు సురక్షితంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం విపత్తు నిర్వహణ విభాగం, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, వాటర్ బోర్డు వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# కాంగ్రెస్ హైకమాండుకు తలొగ్గిన కొండా?



హైదరాబాద్,కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి వెనక్కి తగ్గారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఘాటు వ్యాఖ్యలు చేసిన కొండా పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు మరోసారి వివరణ ఇచ్చారు. రెండు నెలల క్రితం పార్టీ అగ్రనేత రాహుల్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యేలను అవమానించేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన తీరును నిరసిస్తూ ఎమ్మెల్యే నాయిని రాజేంద్రరెడ్డి నివాసంలో నలుగురు ఎమ్మెల్యేలతోపాటు మరికొందరు సీనియర్ నేతలు సమావేశమై, అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే ఓ సారి క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన కొండా, తాజాగా రెండో సారి వివరణ ఇచ్చుకున్నారు.

హైకమాండ్ అసంతృప్తి?

గతంలో గాంధీభవన్ లో నిర్వహించిన విచారణకు హాజరైన కొండా మురళి.. తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోగా, పార్టీ ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఆయన వివరణపై పార్టీ హైకమాండ్ సంతృప్తి చెందలేదని అంటున్నారు. దీంతో ఆదివారం మరోసారి విచారణకు హాజరుకావాల్సిందిగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి నోటీసులిచ్చింది. అంతేకాకుండా లిఖితపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది.

లిఖితపూర్వక వివరణ

తన వివరణపై హైకమాండ్ సంతృప్తి చెందకపోవడంతో మాజీ ఎమ్మెల్సీ కొండా కాస్త వెనక్కి తగ్గారని అంటున్నారు. పార్టీ ఆదేశాల మేరకు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, ఆయన సతీమణి మంత్రి కొండా సురేఖ తీరుతో కాంగ్రెస్ అధిష్టానం తల పట్టుకుంటుందని అంటున్నారు. ఈ ఇద్దరూ పార్టీలో మిగిలిన వారిని కలుపుకుని వెళ్లకపోవడం వల్ల రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పార్టీ హైకమాండ్ భావిస్తోంది.

కాంగ్రెస్ పెద్దల టెన్షన్

స్థానిక ఎన్నికల ముందు పార్టీలో ఈ పరిస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పెద్దలు.. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించాలని భావిస్తున్నారని అంటున్నారు. అందుకే ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్లను సంతృప్తిపరిచేందుకు కొండాను రెండోసారి విచారణకు పిలిపించినట్లు చెబుతున్నారు. ఈ పరిణామంతో ఎమ్మెల్యేలు కొంత శాంతించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. మరోవైపు కొండా కూడా పరిస్థితి గమనించి వివాదానికి ముగింపు పలకాలనే ఆలోచనకు వచ్చినట్లు చెబుతున్నారు. గత విచారణ సమయంలో తగ్గేదేలే అన్న ప్రకటన చేసిన ఆయన ఇప్పుడు కాస్త కూల్ గా ఉన్నారని అంటున్నారు.

# సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు..

హైదరాబాద్, స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఈ నెల 15న కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బీసీలకు రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థలకు ఎన్నికలకు వెళ్లకూడదనే భావనతో రేవంత్ రెడ్డి సర్కార్ ఉంది. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం కేంద్రం వద్ద పెండింగ్ లో ఉంది. దీంతో ఏం చేయాలనే దానిపై కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్రం నుంచి గ్రాంట్స్ విడుదలయ్యే పరిస్థితి లేదు. గత ఏడాది, ఈ ఏడాది కలిపితే రూ. 3 వేల కోట్లు రాష్ట్రానికి కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు గ్రాంట్స్ రావాల్సి ఉంది. మరో వైపు ఈ ఏడాది సెప్టెంబర్ 30 లోపుగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు కూడా ఆదేశించింది.

స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ ఏం చేయనుంది?

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం కేంద్రం వద్ద పెండింగ్ లో ఉంది. ఈ బిల్లుల విషయమై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 6న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినా ఫలితం లేదు. ఇక స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఆలోచిస్తోంది. ఈ నెల 15న పొలిటికల్ ఎఫైర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదనే భావనలో రేవంత్ సర్కార్ ఉంది. అయితే, ఒకవేళ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే పాత పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. 2019లో బీసీలకు 23 శాతం మాత్రమే రిజర్వేషన్ అమలు చేశారు. అలా చేస్తే రాజకీయంగా తమకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని ఆ పార్టీ అనుమానిస్తోంది. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించే అవకాశం ఉంది. ఇతర పార్టీలు కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేయవచ్చు. అయితే రిజర్వేషన్ల అంశంపై ఇచ్చిన హామీని అమలు చేయకుండా పార్టీ పరంగా 42 శాతం టికెట్లు బీసీలకు ఇవ్వాలనే డిమాండ్ పై ఇతర పార్టీలు కాంగ్రెస్ పై విమర్శలు చేసే అవకాశం ఉంది. దీన్ని ఎలా తిప్పికొట్టాలనే దానిపై కూడా హస్తం పార్టీ వ్యూహాలు రచిస్తోంది. రిజర్వేషన్లను అమలు చేస్తామని హామీ ఇచ్చినందున ఈ అంశం తేలేవరకు ఎన్నికలను వాయిదా వేయాలని కోర్టును కోరే అవకాశం కూడా ఉంది. ఏ నిర్ణయం తీసుకొంటే ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బంది ఉండదనే విషయాలపై ఈ నెల 15న జరిగే పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో చర్చించనున్నారు.

రూ. 3 వేల కోట్లు కేంద్రం నిధులు ఎలా?



తెలంగాణలో సర్పంచ్‌ల పదవీ కాలం 2024 జనవరిలో, నవంబర్ లో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల టర్మ్ ముగిసింది. స్థానిక సంస్థలు స్పెషల్ అధికారుల పాలనలో ఉన్నాయి. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తేనే కేంద్రం నుంచి వచ్చే నిధులు రాష్ట్రానికి వస్తాయి. గత ఏడాది రాష్ట్రానికి రూ. 1550 కోట్లు కేంద్రం నుంచి గ్రాంట్స్ రూపంలో స్థానిక సంస్థలకు రావాలి. అయితే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనందునా ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1450 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికిప్పుడు స్థానిక సంస్థలకు ఎన్నికలకు నిర్వహించినా గత ఏడాది విడుదల చేయకుండా నిలిపివేసిన రూ.1550 కోట్లు స్థానిక సంస్థలకు ఇవ్వాలో, వద్దో అనేది కేంద్రం ఇష్టమని అధికారవర్గాలు చెబుతున్నాయి. అయితే గతంలో ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు ఇలా నిలిపివేసిన నిధులను కేంద్రం విడుదల చేసిందని అధికారులు గుర్తు చేస్తున్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు వాయిదా వేస్తే మొత్తం రూ.3 వేల కోట్ల నిధులు రాష్ట్రానికి రాకుండా నిలిచిపోతాయి. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఇలాంటి తరుణంలో ఈ నిధులు రాష్ట్రానికి అవసరం.

ఏర్పాట్లు చేసుకుంటున్న ఎన్నికల సంఘం

స్థానిక సంస్థలకు సెప్టెంబర్ 30 లోపుగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చేసుకుంటోంది. బ్యాలెట్ బాక్సులతో పాటు ఇతర మెటీరియల్ ను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఎన్నికల సంఘం కోరింది. ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు జాబితాలను కూడా రెడీ చేసుకోవాలని ఇప్పటికే క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశాలు వెళ్లాయి. పంచాయతీరాజ్ శాఖ నుంచి రిజర్వేషన్లకు సంబంధించిన డాటా.. రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందితే వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్దంగా ఉన్నారు.

# ఆడుదాం-ఆంధ్ర రిపోర్టు రెడీ.. రోజా వంతు వచ్చేసిందా?

అమరావతి,వైసీపీ నేతల అరెస్టుల పరంపరలో మరో మాజీ మంత్రి వంతు వచ్చిందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ఫైర్ బ్రాండ్, ఆ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా అరెస్టుకు రంగం సిద్ధమవుతోందని అంటున్నారు. 'ఆడుదాం-ఆంధ్ర' స్కాంలో రోజాను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం ఆధారంగా తెలుస్తోంది. శాప్ ఛైర్మన్ రవినాయుడు ఫిర్యాదు మేరకు 'ఆడుదాం-ఆంధ్ర' స్కాంపై విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారని చెబుతున్నారు. నిధుల దుర్వినియోగాన్ని నిర్ధారించడంతో కేసు నమోదుకు ప్రభుత్వం ఆదేశించే అవకాశం ఉందని అంటున్నారు.

రూ. వంద కోట్ల అవినీతి?

గత ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట సుమారు రూ. 119 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో దాదాపు రూ. 100 కోట్ల మేర అవినీతి జరిగిందని ఫిర్యాదులు వచ్చాయి. విజయవాడకు చెందిన ఓ ప్రైవేటు వ్యక్తితోపాటు శాప్ ఛైర్మన్ రవినాయుడు కూడా ఇదే ఆరోపణలు చేయడంతో ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. విచారణకు ఆదేశించింది. దీనిపై విజిలెన్స్ అధికారులకు బాధ్యతలు అప్పగించడంతో వారు సుదీర్ఘ విచారణ జరిపి అవకతవకలు నిజమేనంటూ నివేదిక రెడీ చేసినట్లు చెబుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ నివేదిక డీజీపీ ద్వారా ప్రభుత్వానికి అందివ్వనున్నారని అంటున్నారు.

45 రోజుల్లోనే కోట్ల ఖర్చు

క్రీడా పోటీలకు సంబంధించి పరికరాల కొనుగోలు, ముగింపు ఉత్సవాల పేరిట భారీగా అవినీతి చేశారని విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అప్పటి క్రీడా మంత్రిగా పనిచేసిన వైసీపీ ఫైర్ బ్రాండ్ రోజాపై అభియోగాలు మోపే అవకాశం ఉందంటున్నారు. కేవలం 45 రోజుల్లోనే రూ. 119 కోట్లు ఖర్చు చేయడంపై ప్రభుత్వం, టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఈ కుంభకోణంలో సుమారు



400 కోట్ల కుంభకోణం జరిగిందని కూడా ఆరోపిస్తున్నారు. అయితే రూ. 119 కోట్లు కేటాయిస్తే రూ. 400 కోట్లు అవినీతి ఎలా జరిగిందని వైసీపీ ప్రశ్నిస్తోంది. దీనికి సమాధానంగా జిల్లా క్రీడా సంఘాల నుంచి ఖర్చుచేసిన మొత్తం కూడా ఈ స్కాం కిందకే వస్తుందని టీడీపీ చెబుతోంది. దీంతో విజిలెన్స్ నివేదికలో ఎంత మొత్తం అవినీతిని గుర్తించారనేది కూడా ఉత్కంఠ రేపుతోంది.

రోజాకు బిగిస్తున్న ఉచ్చు

మొత్తానికి మాజీ మంత్రి ఆర్కే రోజాకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి పలు కేసుల్లో రోజాను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరిగింది. ప్రధానంగా ఆమెపై అనుచిత వ్యాఖ్యల కేసులను నమోదు చేస్తారని అనుమానాలు వ్యక్తమయ్యాయి. టీటీడీ దర్శనాల విషయంలోనూ రోజాపై విమర్శలు ఉండటంతో ఆ దిశగాను చర్యలు తీసుకోవచ్చని అనుకున్నారు. కానీ, అవినీతి వ్యవహారంలోనే ఆమెను అరెస్టు చేస్తారని ఎక్కువగా నమ్ముతున్నారు. దీంతో ఆడుదాం-ఆంధ్ర స్కాంలో రోజాపై చర్యలు ఉంటాయని ఊహిస్తున్నారు.

# కొత్త నియామకాలు షర్మిలకు షాకేనా ?



అమరావతి,ఫలితంగా పార్టీలో పెద్ద తలకాయలు సీనియర్లు అంతా సైలెంట్ అయ్యారు. తమకు ఏ మాత్రం సంబంధం లేదు అన్నట్లుగా వారు చోద్యం చూశారు.

కొత్త నియామకాలు షర్మిలకు షాకేనా ?

కాంగ్రెస్ లో ఎపుడు ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదు. జాతీయ అధినాయకత్వం ఆలోచనల మేరకే ఎవరైనా పని చేయాల్సి ఉంటుంది. అయితే రాజకీయంగా వస్తూనే ఒక ప్రాంతీయ పార్టీని తెలంగాణాలో పెట్టి గట్టిగా మూడేళ్ల పాటు నడపకుండానే వైఎస్ షర్మిల తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు. అలా ఏపీకి షిఫ్ట్ అయి ఏపీసీసీ చీఫ్ పదవిని అందుకున్నారు. అది లగాయితూ గత ఏణ్ణర్థం దాకా ఆమె ఏపీలో తానే అంతా అన్నట్లుగా వ్యవహరించారు. ఒక విధంగా ఆమె సొంత పార్టీ మాదిరిగానే ఏపీలో హవా చూపించారు.

వారంతా తప్పుకున్నారు :

ఫలితంగా పార్టీలో పెద్ద తలకాయలు సీనియర్లు అంతా సైలెంట్ అయ్యారు. తమకు ఏ మాత్రం సంబంధం లేదు అన్నట్లుగా వారు చోద్యం చూశారు. దీంతో హై కమాండ్ కి ఫిర్యాదులు వెళ్ళాయని చెబుతారు. ఏకంగా షర్మిలనే తప్పించాలని కొత్త చీఫ్ ని నియమించాలని కూడా డిమాండ్లు వెళ్ళాయని అంటారు. అయితే చాలా ఆచీతూచీ హై కమాండ్ వ్యవహరించింది అని అంటున్నారు. షర్మిలను తప్పించకుండానే ఆమె చేతులు కట్టేసింది అని అంటున్నారు.

అందరిలో ఒకరిగా :

ఏపీ కాంగ్రెస్ లో పాతిక మంది సీనియర్లతో పొలిటికల్ అడ్వైజర్స్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా పార్టీలో సమిష్టి నాయకత్వానికి తెర తీశారు. సీనియర్లను అందులోకి తీసుకుని రావడం ద్వారా షర్మిలను కూడా వారితో పాటే ఉంచారు. ఆమె పీసీసీ చీఫ్ గా ఉన్నా అందరితో పాటే ఆమె నడచుకోవాలని సంకేతాలు పంపించారు. ఆమె సొంత నిర్ణయాలు చెల్లవని దాదాపుగా చెప్పాల్సింది ఈ విధంగా చెప్పేశారు అని అంటున్నారు. ఏ డెసిషన్ అయినా పీఏసీ తీసుకుంటుంది దానిని బట్టే ఆమె నడచుకోవాల్సి ఉంటుంది అని అంటున్నారు.

బంతి ఆమె కోర్టుకే :

ఇక ఈ విధంగా చేయడం ద్వారా నిర్ణయం షర్మిలకే ఇచ్చారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో కొనసాగితే ఆ పార్టీతో అందరితో సమిష్టిగానే ముందుకు సాగాలి. ఆమె గతంలో మాదిరిగా సింగిల్ గా ఫోకస్ అవలేరు. సీనియర్లు కూడా తెర మీద ఉంటారు. దాంతో ఆమె పార్టీతో కలసి పనిచేయడమా లేక తప్పుకోవడమా అన్నది ఆమెకే చాయిస్ గా ఉందని అంటున్నారు. షర్మిలను ఎందుకు తప్పించలేదు అంటే ఇక్కడే కాంగ్రెస్ వ్యూహం ఉందని చెబుతున్నారు. ఆమె వైఎస్సార్ కుమార్తె. దాంతో ఆమెను తప్పిస్తే ఎంతో కొంత ప్రభావం పడుతుంది అన్న అన్న ఆలోచన కావచ్చు అని అంటున్నారు. ఆమెను ముందు పెట్టి వైఎస్సార్ చరిష్మాను తమ వైపు తిప్పుకునే స్ట్రాటజీ కావచ్చు అని కూడా అంటున్నారు.

షర్మిలకు లాభమేనా :

కాంగ్రెస్ అంటేనే మహా సముద్రం. అందులో ఎంతో మంది నేతలు ఉంటారు. అందువల్ల ఏ ఒక్కరి మాటో చలామణీ అవదు. ఇపుడు ఏపీ కాంగ్రెస్ లో అదే జరుగుతుంది. దాంతో ఈ సమిష్టి బాధ్యతలు నాయకత్వం వల్ల షర్మిల ప్రాధాన్యత తగ్గినట్లే అంటున్నారు. ఒక విధంగా ఆమెకు షాక్ ఇచ్చారని చెబుతున్నారు. ఆమె పార్టీ కోసం కష్టపడి రేపటి రోజున కాంగ్రెస్ కి ఏపీలో ఏమైనా మంచిగా ఉంటే ఆమెకు కూడా పదవులు దక్కితే దక్కవచ్చు. కానీ ఈలోగా మాత్రం అందరితో కలసి పార్టీని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ రకమైన సందేశం పార్టీ ఇచ్చిన తరువాత షర్మిల మౌనంగా ఉంటున్నారు అని అంటున్నారు. ఆమె కాంగ్రెస్ తో ఉంటే లాభమేనా అంటే కాంగ్రెస్ లో అవకాశాలు రావడం అంటే జాక్ పాట్ కొట్టినట్లే. ఓపికగా వేచి చూడాల్సిందే. సో షర్మిల ఇపుడు ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# బాబు డ్రీం ప్రాజెక్ట్...టార్గెట్ చేసిన అనుకూల మీడియా



అమరావతి,తెలుగుదేశం అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపుడూ వినూత్నంగా ఆలోచిస్తూంటారు. ఆయన రొటీన్ కి భిన్నంగా కొన్ని విషయాల్లో వ్యవహరిస్తారు. ఆయన ప్లాన్స్ అన్నీ భారీ కాన్వాస్ తో పరచుకుని ఉంటాయి. అలా తన ప్లాన్స్ ని అన్నింటినీ సంపూర్ణంగా చేయాలన్న సంకల్పం సైతం ఆయనకు ఉంటుంది. అయితే బాబు ఎంచుకున్న మార్గం సుగమం కాదు అది ఒకింత దుర్లభం దుర్గమం. అయినా ఆయన చాలెంజ్ గా తీసుకుంటారు. కాదు జరగదు అన్నది ఆయన థియరీలో లేదు, అందరి చేతా అవును అనిపిస్తారు. చంద్రబాబు అనేక విషయాల్లో సక్సెస్ అయ్యారు. కొన్ని విషయాల్లో విమర్శలూ ఎదుర్కొన్నారు. ఇదిలా ఉంటే ఏపీకి నాలుగవ సారి సీఎం అయిన చంద్రబాబు మదిలో ఎన్నో ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో అమరావతి రాజధాని ఒకటి. అయితే దానితో పాటుగా ఆయన మానసపుత్రికగా మరో ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్ట్ బాబుకు నిజంగా ఎంతో ఇష్టమైనది సంతృప్తిని ఇచ్చేది అని చెప్పుకుంటారు. అలాంటి బాబు డ్రీం ప్రాజెక్ట్ మీద అనుకూల మీడియావే గట్టిగా టార్గెట్ చేస్తూ హాట్ హాట్ గా కామెంట్స్ చేసింది. ఇంతకీ ఏమా ప్రాజెక్ట్, ఏమా కథ అంటే మ్యాటర్ చాలానే ఉంది మరి.

పీ 4 మీద విమర్శలు :

చంద్రబాబు పీ 4 ప్రాజెక్ట్ ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఏపీలో పేదరికం అన్నది లేకుండా చేయాలన్నదే ఆయన ఆలోచన. ఏపీలో అత్యంత పేదరికం తో సతమతమవుతున్న వారు ఇరవై శాతం గా ఉన్నారు. వారిని బాగా ధనవంతులుగా ఉన్న పది శాతం మందికి ఎటాచ్ చేసి వారికి అండగా నిలిచేలా చేసేదే ఈ పీ 4 ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వం ఒక వేదికగా ఉంటుంది. అంటే ధనవంతులను పేదలను కలిపి అంతరం తగ్గించడం. పేదరికం పూర్తిగా లేకుండా చేయడం. ఇది చెప్పడానికి మంచి ప్రాజెక్ట్ కానీ ఆచరణలో ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయి. అందుకే ఈ ప్రాజెక్ట్ మీద ఏపీలో ప్రముఖ మీడియా సంస్థ విశ్లేషిస్తూ బాబు నీద ఘాటు వ్యాఖ్యలు చేసింది.

అయ్యే పనేనా అంటూ :

ఈ భూమి మీద ఎపుడూ అంతరం ఉంది అన్నది ఒక సిద్ధాంతం. పేదలు లేని సమాజం లేదు అన్నది మరో ఫీలాసఫీ. ఈ రెండూ నిజమే. అందుకే పేదరికం ఎక్కడకి వెళ్ళినా కనిపిస్తుంది. అభివృద్ధి ఎంతో చెందామని చెప్పుకునే దేశాలలో సైతం పేదరికం రెక్కలు విప్పుకుని చాలా చోట్ల దర్శనం ఇస్తుంది. ఎవరైనా చేసే పని పేదరికాన్ని వీలైనంత వరకూ తగ్గించే ప్రయత్నం చేయడమే కానీ పేదరికం అన్నది లేకుండా చేయడం ఎవరి వల్లా కానే కాదు అన్నది అంతా చెబుతున్న మాట. దానినే పట్టుకుని సదరు టీడీపీ అనుకూల మీడియా బాబు తీరుని తప్పుపడుతోంది. బాబు ఎందుకు ఈ తరహా ప్రాజెక్టుని ఎంచుకున్నారో అర్థం కావడం లేదు అంటూ కామెంట్స్ చేసింది.

వారి వల్లనే ఇదంతా అంటూ :

బాబు ఎపుడు సీఎం అయినా ఆయన పక్కన కొంతమంది చేరుతారు అని వారు ఇచ్చే సలహా సూచనల వల్లనే ఈ తరహా ఆలోచనలు వస్తూంటాయని కూడా సదరు మీడియా దుయ్యబెట్టింది. బాబు సైతం తన శ్రమను ఆలోచనలను సమయాన్ని అంతా ఈ తరహా వాటి మీద ఎక్కువగా పెడుతూ విలువైన కాలాన్ని అలా ఉపయోగిస్తున్నారు అని చెణుకులు వేసింది. 2029 నాటికి ఏపీలో పేదరికం లేకుండా చేస్తామని బాబు చెబుతున్న మాటలను కూడా సదరు మీడియా తమ విశ్లేషణలలో గట్టిగా తప్పుపట్టింది. బాబు అధికారంలోకి వచ్చిన ప్రతీసారీ ఈ కొత్త రకం ఆలోచనల వెంట పడడం వృధా ప్రయాస పడడం మామూలు అయిపోయింది అని కూడా విమర్శిస్తోంది.

అచరణ సాధ్యం కానిది :

పీ 4 పథకం ఆచరణ సాధ్యం కాదని కూడా సదరు మీడియా కుండబద్ధలు కొడుతోంది. అంతే కాదు అది ఏ విధంగానూ ఉపయోగం లేనిది అని అంటోంది. కనీస ఆలోచనలు చేయకుండా బలవంతంగా మార్గదర్శులకు బాధ్యతలు ఇస్తున్నారని అంటున్నారు. చంద్రబాబుతో వచ్చిన తంటా ఏమిటి అంటే ఆయన ఏది పట్టుకుంటే దాని వెంట పడతారు. అలవిమాలిన ఆలోచనలను ఆయన ఇష్టపడుతూంటారు అని విమర్శించింది. పేదలను ధనవంతులు దత్తత తీసుకోవాలని ఈ ప్రాజెక్ట్ ద్వారా కోరుతున్నారు. ఇవన్నీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ఆలోచనలు అని కూడా నిప్పులు చెరిగింది. మొత్తానికి బాబు నేల విడిచి సాము చేస్తున్నారు అని తేల్చేసింది. మరి బాబుకు ఎంతో ప్రీతిపాత్రమైన పీ 4 ప్రాజెక్ట్ మీద ఒక అనుకూల మీడియావే ఈ విధంగా ధాటీగా విమర్శించడం మీద టీడీపీ ఏ విధంగా రియాక్ట్ అవుతుందో చూడాల్సి ఉంటుంది.

# బీఆర్ఎస్‌లోనే కాదు అన్ని పార్టీల్లోనూ వివాదాలు : కవిత

హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీలోనే వివాదాలు ఉన్నట్లుగా మీడియా ప్రచారం చేస్తోందని కల్వకుంట్ల కవిత అసహనం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పార్టీల్లోనూ వివాదాలు ఉన్నాయని గుర్తు చేశారు. సింగరేణికి సంబంధించి తన పట్టును నిరూపించుకోవడం కోసం కవిత జాగృతి విభాగాన్ని, మరో కార్మిక సంఘంతో అనుబంధానం చేశారు. బీఆర్ఎస్ అధికారిక కార్మిక సంఘాన్ని పక్కన పెట్టేశారు. బీఎంఎస్ కార్మిక సంఘంతో సమావేశమైన తర్వాత కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని పార్టీల్లోనూ ఏదో ఒక వివాదం నడుస్తోందని .. సీఎం రేవంత్‌రెడ్డి ఏదైనా మాట్లాడితే.. అరగంటలోనే రాజగోపాల్‌రెడ్డి ఖండిస్తున్నారని కవిత అన్నారు. అలాగే బండి సంజయ్‌కు డైరెక్ట్‌గా ఈటల వార్నింగ్ ఇస్తున్నారన్నారు. అన్ని పార్టీల్లో ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. %దీ=నా%పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కవిత తాను బీఆర్ఎస్ పార్టీకి దూరం అయ్యానని ఏ మాత్రం అంగీకరించడం లేదు. తాను పార్టీలోనే ఉన్నానని చెప్పుకునేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అయితే కవితకు బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వానించడం లేదు. కవిత కూడా వారు పిలవడం లేదని ఫీల్ కావడం లేదు.



తన జాగృతి తరపునే రాజకీయం చేస్తున్నారు. కానీ తన పార్టీ బీఆర్ఎస్ అంటున్నారు. జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించే వరకూ ఇలాగే చేస్తారని బీఆర్ఎస్ నేతలంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com